
వార్త
ఆదివారం
11 సెప్టెంబరు, 2022
అక్రమ శిఖరాలు!



తమన్నా ఆ మధ్య ఒప్పుకున్న సినిమాల్లో 'గుర్తుందా శీతాకాలం' ఒకటి. ఈ సినిమా విడుదలకి సిద్ధమై చాలా కాలమైంది. అయితే ఎప్పటికప్పుడు పోటీ ఎక్కువగా ఉండటంతో వాయిదా పడుతూ వచ్చింది. ఈ సినిమాలో ఆమె జోడీగా సత్యదేవ్ కనిపించనున్నాడు. హీరోగా ఈ సినిమాలో ఆయన పాత్ర చాలా డిఫరెంట్‌గా ఉండనుంది.

కథానాయకుడి జీవితంలో ఆయా దశల్లో.. ఆయా సందర్భంలో చోటు చేసుకునే ప్రేమకథలే ఈ సినిమా. ప్రధానమైన

# విభిన్న కథా చిత్రం 'గుర్తుందా శీతాకాలం'

ప్రేమకథలో తమన్నా కనిపిస్తుంది. భావన రవి, చింతపల్లి రామారావు నిర్మించిన ఈ సినిమాకి కాలభైరవ సంగీతం అందించాడు. నాగశేఖర్ ఈ సినిమాకి దర్శకత్వం వహించాడు. 'గాడ్సే' ఫ్లాప్ తరువాత సత్యదేవ్ నుంచి, 'ఎఫ్ 3' హిట్ తరువాత తమన్నా నుంచి వస్తున్న సినిమా 'గుర్తుందా శీతాకాలం'.

## తారాతీరం

**ప్రభాస్** ప్రస్తుతం 'ప్రాజెక్టు రీ' సినిమా పనుల్లో బిజీగా ఉన్నాడు. వైజయంతి బ్యానర్‌లో నాగ్ అశ్విన్ దర్శకత్వంలో ఈ సినిమా రూపొందుతోంది. ఆ తరువాత ప్రభాస్ 'స్పిరిట్' సినిమా చేస్తాడని అనుకున్నారంతా. కానీ ఈ రెండు సినిమాల మధ్యలో మారుతి దర్శకత్వంలో ఆయన ఒక సినిమా చేయనున్నట్టు వినికిడి. ఈ సినిమాకి మారుతి 'రాజా డీలక్స్' అనే టైటిల్‌ను సెట్ చేసే ఆలోచనలో ఉన్నాడు. 'రాజా డీలక్స్' ఒక థియేటర్. ఆ థియేటర్ చుట్టూ తిరిగే హారర్ కామెడీయే ఈ సినిమా అని టాక్. ఈ కథ తాత-మనవడు అనే రెండు ప్రధాన పాత్రలను ఆధారంగా చేసుకుని నడుస్తుందనేది తాజా సమాచారం. మారుతి ఇంతవరకు

# తాత-మనవడు నేపథ్యంలో ప్రభాస్ చిత్రం



చేస్తూ వచ్చిన బడ్జెట్‌లోనే ఈ సినిమా ఉంటుందని సమాచారం. అయితే కథా పరంగా ప్రభాస్ స్థాయిలో ఉంటూ పాన్ ఇండియా రిలీజ్ ఉంటుందని సమాచారం.

ఆదివారం వార్త
sunmagvaartha@gmail.com
11 సెప్టెంబరు, 2022

## మంచి ముత్యాలు

ప్రపంచాన్ని అర్థం చేసుకోవాలనే కోరిక, దాన్ని మార్చాలనే కోరిక – ఈ రెండూ మానవ ప్రగతికి ప్రధాన ప్రేరకాలు.

\- బెర్ట్రాండ్ రస్సెల్

## విషయ విశేషం

విషపూరితమైన పక్షి... 4
'సంఘీ'భావం....5
జలాశయాల సద్వినియోగంతోనే..
ప్రాచీన ప్రపంచ వింత..6
కవర్ స్టోరీ..8
అక్రమ శిఖరాలు!
ఈవారం కవిత్వం..12
నిశ్శబ్ద రాత్రి..
బతికి సాధిద్దాం!...14
ఆరోగ్యసిరి లీచీ పండు...18
కథ.. 20
బొరుసు
సాహిత్యం.. 23
తెలుగుకు ప్రాణదాత 'గిడుగు'..
బుల్లెట్ కాఫీ తాగేద్దాం.... 25
చిత్రభారతి.. .30
మమతలకు మారుపేరు తమిళ సినిమా ... 30
ఇంకా..
పుస్తక సమీక్ష
మొగ్గ
వారఫలం
కాసేపు సరదాగా నవ్వుకోండి
వగైరా..వగైరా..




# తాజా వార్తలు

## వైరల్ వ్యాధులను అరికట్టవచ్చు!



దోమలు కుట్టడానికి కొన్ని వైరస్‌లు కారణమంటున్నారు కనెక్టికట్‌కు చెందిన పరిశోధకులు. శరీరంలోకి ప్రవేశించిన డెంగీ, జికా వైరస్‌లు ఎసిటోఫెనోన్ అనే రసాయనాన్ని విడుదల చేసే బాసిల్లస్ అనే బ్యాక్టీరియా శాతాన్ని చర్మం మీద పెరిగేలా చేస్తున్నాయట. ఆ వాసన నచ్చి వచ్చిన దోమలు ఆ వ్యక్తిని కుట్టడంతో వైరస్ ఒకరి నుంచి మరొకరికి సులభంగా పాకుతుందట. ఈ విషయం ఎలుకల్లో పరిశీలించగా వైరస్ సోకిన ఎలుకలు మామూలు ఎలుకలకన్నా ఎక్కువగా ఈ రసాయనాన్ని విడుదల చేస్తున్నాయట. అదే విధంగా డెంగీ సోకని వాళ్లతో పోలిస్తే సోకిన వ్యక్తుల చంకల నుంచే ఈ ఎసిటోఫెనోన్ ఎక్కువగా విడుదల వుతుందట. దీన్నిబట్టి వైరస్‌లే ఈ రకమైన వాసనకు కారణమైన బ్యాక్టీరియా చర్మం మీద పెరిగేలా చేసి దోమల్ని ఆకర్షిస్తున్నాయనీ తద్వారా అవి వ్యాపిస్తున్నాయని అంటున్నారు. దాంతో ఆ వాసనని అరికట్టేందుకు ఐసొట్రెటినోయిన్ అనే మందుని చికిత్సలో వాడినప్పుడు అందుకు కారణమైన బ్యాక్టీరియా శాతం తగ్గిందట. దాంతో ఈ మందు ద్వారా ఈ వైరల్ వ్యాధుల వ్యాప్తిని అడ్డుకోవచ్చంటున్నారు.

### వెండిపురుగు

మెటల్‌లా కనిపించే పురుగుల్ని మీరు ఎప్పుడైనా చూశారా? ఇవి చూసేందుకు బొమ్మల్లా కనిపిస్తాయి. కానీ ఇవి బొమ్మలు కావు, నిజమైన జీవి. దీని పేరు 'క్రిసినా లింబేటా'. మధ్య అమెరికాలో ఎక్కువగా వుండే ఈ పురుగు వెండి రంగులో మెరుస్తూ అచ్చంగా మెటల్‌లా కనిపిస్తుంది. ఆ పురుగు కదిలేవరకూ అది జీవమున్న పురుగున్న విషయం తెలియదు. అందువల్ల దీనిని 'లివింగ్ జ్యువెలరీ' అని దీనికి మరో పేరు.

### అక్కాచెల్లెళ్లు అద్దెకు..

ఎక్కడికైనా వెళ్లాలంటే ఏదో ఒక వెహికల్‌ను అద్దెకు తీసుకోవటం సాధారణం. ఫర్నిచర్‌తో సహా ఇంటిని అద్దెకు తీసుకోవడం తెలిసిందే. కానీ జపాన్‌లో అక్కాచెల్లెళ్లు కూడా అద్దెకు లభిస్తారు. ఇది ముమ్మాటికీ నిజమే. 'రెంట్ ఏ సిస్టర్' పేరుతో జపాన్‌లో ఓ సంస్థ ఈ సేవలను అందిస్తోంది. అక్కాచెల్లెళ్లు లేకుండా ఒంటరితనంతో బాధపడేవారికి ఈ సంస్థ అక్కాచెల్లెళ్లను అద్దెకిస్తోందట. ఒంటరితనంతో బాధపతున్నవారి ఒత్తిడిని తగ్గించి, సంతోషంగా ఉంచడానికి 'అద్దెకు అక్కాచెల్లెళ్లు' ఆలోచన వచ్చిందట. వీరు కబుర్లు చెప్తూ, వాళ్ల బాధలు వింటూ రోజంతా గడుపుతారట.






# విషపూరితమైన పక్షి

**విషవృక్షాలు, విష జంతువులు, విషసర్పాల గురించి వింటుంటాం. కానీ విషపూరితమైన పక్షులు కూడా ఉంటాయని ఎవరూ ఊహించం. అయితే ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా ఒక పక్షిని విషపూరితమైందిగా శాస్త్రవేత్తలు గుర్తించారు.**





పాపువాన్యూగినీ అడవుల్లో విరివిగా సంచరించే ఈ పక్షిని 'హుడెడ్ పిటోహుయి' అని పిలుస్తారు. ఈ పక్షి కూత ఎంతో ఘనంగా ఉంటుంది. బిగ్గరగా కూత పెట్టే పక్షుల్లో ఇది కూడా ఒకటని అనుకున్నారు. కానీ దీనికున్న విష లక్షణాన్ని ఎవరూ గుర్తించ లేదు. అయితే అనుకోకుండా దీని విష లక్షణం బయట పడింది. అదెలాగంటే అమెరికాకు చెందిన విహంగ శాస్త్రవేత్త జాక్ డంబాషర్ మూడు దశాబ్దాల కిందట పాపువాన్యూగినీ అడవుల్లో కొత్త కొత్త పక్షులను అన్వేషిస్తూ, వలలను ఏర్పాటు చేసిన సమయంలో వీటి ధాటి ఆయనకు అనుభవపూర్వకంగా తెలిసింది. అతను ఏర్పాటు చేసిన వలల్లో కొన్ని హుడెడ్ పిటోహుయి పక్షులు చిక్కుకున్నాయి. వాటిని బయటకు తీసి, పరిశీలించే ప్రయత్నం చేసినప్పుడు అవి ఆయన వేళ్లను గోళ్లతో రక్కి, ముక్కుతో పొడి చాయి. అలవాటు ప్రకారం ఆయన నెత్తురోడుతున్న వేళ్లను నోటితో చప్పరించి, ఉపశమనం పొందే ప్రయత్నం చేశాడు. కొద్దిసేపటికి ఆయన పెదవులు, నాలుక వాచిపోయి, క్రమంగా మొద్దుబారాయి. ఇది పక్షి ప్రభావమే అనుకుని, ఆ పక్షి ఈకలను తనతో తీసుకువెళ్లాడు. పక్షులు గాయపరిచినప్పుడు ఏర్పడిన విషలక్షణాలు తగ్గిన తర్వాత మళ్లీ పరీక్షించడానికి ఒకసారి తన వెంట తెచ్చుకున్న పక్షి ఈకను నోటికి తాకించుకున్నాడు. దాంతో మళ్లీ పెదవులు, నాలుక వాచి మొద్దుబారిపోయాయి. దీంతో 'హుడెడ్ పిటోహుయి' ని ప్రపంచంలోనే తొలి విష విహంగంగా శాస్త్రవేత్తలు గుర్తించారు. పక్షుల్లో విష ప్రభావం చూపగలిగినది ఇప్పటివరకు ఇదొక్కటే! ఇలాంటి పక్షులు ఇంకెక్కడైనా ఉన్నాయా అన్న విషయం ఇంతవరకైతే తెలియదు.

## 'సంఘీ' భావం



# జలాశయాల సద్వినియోగంతోనే బంగారు పంటలు

గతంలో ఎన్నడూ లేనివిధంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో జలశయాలు నిండుకుండల్లా మారాయి. ఈసారి వర్షాల సీజన్ ప్రారంభంలోనే భారీగా కురిసిన వర్షాలు, ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన వరద నీరు ఊహించని విధంగా ప్రాజెక్టులకు జలకళను తెప్పించాయి. రెండు నెలల ముందు నుంచే ప్రాజెక్టులకు భారీగా నీరు చేరడంతో గేట్లు ఎత్తివేసి దిగువకు నీటిని వదలడం ప్రారంభించారు. దీనితో ప్రధాన జలాశయాలతో పాటు చిన్నా చితక నీటి వనరులు కలిగిన చెరువులు, కుంటలు, బ్యారేజీలు అన్నీ నీటిని పూర్తి స్థాయిలో నింపుకుని సంవత్సరం పొడవునా నీటి సమస్య లేకుండా చూసేందుకు జలాశయాలు సిద్ధంగా ఉన్నాయి. నీటిని సద్వినియోగం చేసుకుంటే ఈసారి ఆయకట్టు పెరగడంతో పాటు రెండు రాష్ట్రాల్లో దిగుబడి గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. అదే విధంగా నీటి నిల్వలు అధికంగా ఉండటంతో భూగర్భ జలాలపై కూడా ప్రభావం అధికంగానే ఉంది. సాధారణంగా వర్షాలు ఆగస్టు నెలలో కురిసేవి. ఈసారి అందుకు భిన్నంగా జూన్ నెలాఖరు నుంచే కుండపోత వర్షాలు కురిసాయి. ఎగువ ప్రాంతంలో వరద నీరు అధికంగా వచ్చి చేరింది. నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్ట్ గేట్లు రెండుసార్లు ఎత్తివేయడమే కాకుండా ఎక్కువ రోజుల పాటు వచ్చిన నీటిని వచ్చినట్లే దిగువకు వదులుతూ వచ్చారు. భారీ వర్షాలకు కోనసీమ జిల్లాలో అనేక లంకగ్రామాల్లో నీరు చేరి నెల రోజుల వరకు నిల్వ ఉండిపోయిందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఈ ప్రాంతాల్లో వరదలు రావడం, కొన్ని రోజుల పాటు ఇళ్లను వదిలి వేరే ప్రాంతాల్లో తలదాచుకోవడం సర్వసాధారణమే అయినా ఈసారి అనూహ్యరీతిలో ముందుగానే వరదలు రావడం, నెల రోజుల పైబడి పునరావాస కేంద్రాల్లో గడపాల్సి రావడం స్థానికులను ఇబ్బందులకు గురిచేసింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో కృష్ణానది, గోదావరి నదులకు సంబంధించి పరీవాహక ప్రాంతాలు ఉన్నాయి. ఈ రెండు ప్రధాన నదులు అనేక ఉపనదులతో కలిసి పలు జిల్లాల్లో ప్రవహిస్తూ ఆయా ప్రాంతాలను సస్యశ్యామలం చేస్తున్నాయి. భారీగా కురిసిన వర్షాలతో అన్ని జలాశయాలు నిండుకుండలా ఉన్నాయి. ఆల్మట్టి డ్యామ్‌లో 129 టిఎంపిల గరిష్ట సామర్థ్యం ఉండగా ప్రస్తుతం నూరుశాతం నిండుగా ఉంది. ఇక నారాయణపూర్ రిజర్వాయర్‌లో 37.64 టిఎంసీలకు గాను 37.20 టిఎంసిలకు పైగా నీరు నిల్వ ఉంది. ఉజ్జయిని రిజర్వాయర్ 117.24 టిఎంసిలకు 117 24 టిఎంసిల పూర్తి సామర్థ్యానికి నీరు చేరింది. జూరాల 9.66 టిఎంసిల నీరు చేరడంతో గేట్లు ఎత్తి ఎప్పటికప్పుడు నీటిని దిగువకు వదులుతున్నారు. ఇక తెలుగు రాష్ట్రాల్లో అతిపెద్ద ఆనకట్టగా ఉన్న శ్రీశైలం ప్రాజెక్ట్‌లో 215 టిఎంసిలకు పూర్తి స్థాయిలో నీరు చేరింది. తుంగభద్ర ప్రాజెక్ట్‌లో కూడా 105 టిఎంసి నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతం నుంచి వచ్చే నీటిని దిగువకు దశలవారీగా పంపిస్తూ ఉండటంతో నల్గొండ జిల్లాలోని నాగార్జునసాగర్‌కు నీటి ప్రవాహం అధికంగా ఉంటోంది. నాగార్జునసాగర్‌లో 312 టిఎంసిల సామర్థ్యానికిగాను నూరు శాతం నీటి నిల్వతో కళకళలాడుతోంది. ఇక పులిచింతల పరిస్థితి ఇదే విధంగా ఉంది. ఈ సీజన్‌లో కృష్ణానది పరవళ్లు తొక్కడం ప్రారంభించడానికి ముందే గోదావరి నది ఉగ్రరూపాన్ని ప్రదర్శించింది. జైక్వాడీ ప్రాజెక్ట్ నుంచి ధవళేశ్వరం వరకు ఏమాత్రం తగ్గకుండా వరద పోటెత్తింది. దీనికి తోడు కాళేశ్వరం ప్రాజెక్ట్, పోలవరం ప్రాజెక్ట్‌ల నిర్మాణాలు వరద నీటిని గ్రామాలవైపు మళ్లించడంతో ప్రజలు భారీ నష్టాన్ని చవిచూడాల్సి వచ్చింది. గోదావరి నదిపై నిర్మించిన అన్ని ప్రాజెక్ట్‌లు కూడా పూర్తి సామర్థ్యం నీటి నిల్వతో నిండి ఉంది. జైక్వాడీ ప్రాజెక్ట్‌లో 102 టిఎంసిలు, సింగూరులో సుమారు 29 టిఎంసిలు, నిజాంసాగర్‌లో 17 టిఎంసిలు, శ్రీరామ్ సాగర్‌లో 85 టిఎంసిలు, మధ్యమానేరులో 22 టిఎంసిలు, దిగువ మానేరులో 22 టిఎంసిలు, కడెంలో 7 టిఎంసిలు, శ్రీపాద ఎల్లంపల్లిలో 18 టిఎంసిల నీరు నిల్వ ఉంది. అన్ని ప్రాజెక్ట్‌లు నిండుకుండలా ఉన్నప్పటికీ ఇంకా ఎగువ ప్రాంతం నుంచి నీరు వచ్చి చేరుతూనే ఉంది. ఒక టిఎంసి నీటితో పదివేల ఎకరాల్లో వరి పంటను పండించవచ్చు. ఇతర పంటలు అయితే ఈ విస్తీర్ణం మరింతగా పెరుగుతుంది. ఇప్పటికే సుమారు మూడు నుంచి నాలుగు వేల టిఎంసిల నీటిని సముద్రంలోకి వదిలారు. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యాన్ని పెంచుకుంటే మరింతగా నీటిని నిల్వలను పొందే అవకాశం ఉంది. ప్రస్తుతం నిర్మించి ఉన్న జలాశయాలు అన్నీ సరైన నిర్వహణ లేకుండా ఉన్నాయి. దీనికి ఉదాహరణ కడెం, గుండ్లకమ్మ, అన్నమయ్య ప్రాజెక్ట్‌లు గతేడాది వచ్చిన వర్షాలకు అన్నమయ్య ప్రాజెక్ట్ గేట్లు కొట్టుకుపోవడం భారీ నష్టం కలిగింది. సుమారు 33 మంది ప్రాణాలు కోల్పోవలసి వచ్చింది. ఈసారి భారీ వర్షాలను తట్టుకోలేక కడెం ప్రాజెక్ట్ గజగజలాడింది. ఏ క్షణంలో ఈ ప్రాజెక్ట్ కొట్టుకుపోతుందో అని భయపడుతున్నప్పుడు దీనికి సమీపంలో పడిన గండి ప్రాజెక్ట్‌కు ఊపిరి పోసింది. ప్రాజెక్ట్‌ల వద్ద ఇసుక మేటలు వేస్తోంది. గేట్లు తెరుచుకోనని మొరాయిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వాలు వెంటనే తగిన చర్యలు తీసుకుని ప్రాజెక్ట్‌లను పూర్తిస్థాయి మరమ్మత్తులు చేయించాలి. ఇసుక మేటలను తొలగిస్తే ఎక్కువ నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం కలగడమే కాకుండా ఎంతటి వరదలు వచ్చినా అవి చెక్కుచెదరకుండా నిలుస్తాయి. అదేవిధంగా వీలైనన్ని చెక్‌డ్యామ్‌లను నిర్మించడం ద్వారా ఎక్కడికక్కడ నీటి నిల్వలు చేసుకునే అవకాశం కలుగుతుంది. ప్రాజెక్ట్‌లకు అనుసంధానంగా చెరువుల నిర్మాణం చేపట్టాలి. దీనివల్ల ఆయా ప్రాంతాల వారికి నీటిని అందించడమే కాకుండా భూగర్భ జలాలను పెంచుకునే అవకాశం కలుగుతుంది.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ



# ప్రాచీన ప్రపంచ వింత
# ఈజిప్టు పిరమిడ్‌లు

షేక్ అబ్దుల్ వాకీం జాని

అయిదు వేల సంవత్సరాల నాటి మానవ మేధస్సుకు, సాంకేతిక పరిజ్ఞానానికి ప్రతీకగా నేటికీ సజీవ సాక్ష్యంగా నిలిచి వున్న ప్రాచీన ప్రపంచ వింత ఈజిప్టు పిరమిడ్‌లు. అలనాటి ఈజిప్టు పాలకులను 'ఫారోలు' అని పిలిచేవారు. వీరినే ఫరో చక్రవర్తులు అని కూడా పిలిచేవారు. మనిషి చనిపోయిన తరువాత జీవించే ఉంటాడని అప్పటి ఈజిప్షియన్ల నమ్మకం. ఆ కారణంగా ఫరో చక్రవర్తులు మరణించిన తర్వాత వారి మృతదేహాలను బంగారు పూత పూసి ఈజిప్టు పిరమిడ్‌లలో భద్రపరిచేవారు. అలా చేస్తే మళ్లీ మంత్రశక్తి వలన పునరుజ్జీవనం పొందుతారని అప్పటి ఈజిప్టు ప్రజల విశ్వాసం. ఫరో చక్రవర్తుల శవాలకు బంగారు పూతతో పాటు అనేక రకాల వనమూలికలు, ఔషధాలతో పాటు వస్త్రంలో చుట్టేస్తారు. ఇలా చుట్టిన మృతదేహాన్ని మమ్మీలు అంటారు. చనిపోయిన రాజులు, రాణుల శవాలపై నిర్మించిన కట్టడమే ఈజిప్టు పిరమిడ్. నేడు ఆంగ్ల మాధ్యమంలో విద్యాభ్యాసం చేస్తున్న చిన్నారులు తమ తల్లులను 'మమ్మీ' అని పిలుస్తుంటారు. అలా పిలవకూడదని అనేకమంది ప్రజల్లో చైతన్యం కలిగించారు. ఈజిప్టు పిరమిడ్‌లలో భద్రపరచడానికి సిద్ధంగా ఉన్న ఫరో చక్రవర్తులు, రాజుల, రాణుల శవాలను మమ్మీలు అంటారు అని తెలిసినప్పటికీ నేటికీ అనేక మంది పిల్లలు తమ తల్లులను మమ్మీ అని పిలుస్తూనే ఉన్నారు.

ఈజిప్టు నాగరికతకు ప్రతిబింబం పిరమిడ్‌లు జ్యామితి పరంగా పిరమిడ్ బయటి తలములు త్రిభుజాకారంగా ఉండి, పై చివర ఒక బిందువుతో అంతమౌతుంది. ప్రపంచంలో అత్యంత గొప్ప, అత్యున్నత సాంకేతిక విలువలతో నిర్మించిన కట్టడాల్లో ఈజిప్టు పిరమిడ్లు ప్రముఖమైనవి. ప్రాచీన, మధ్య యుగపు ఈజిప్టు నాగరికతలకు ఇవి ప్రతిబింబంగా నిలిచిపోయాయి. ఇవి క్రీ.పూ.2886-2160 మధ్య కాలం నాటివి. నైలునదీ లోయకు 51వ మైలు వద్ద, నైలు నదికి పశ్చిమంలో ప్రాచీన మెంఫిసిస్ వద్ద అనేక పిరమిడ్‌లు కనిపిస్తాయి. ఈ పిరమిడ్‌లు సమాధుల రూపాలు. వీటిలో ఈజిప్టు రాజులు, రాణులను సమాధి చేశారు. ప్రాచీన ప్రపంచ నాగరికతకు అద్దం పట్టే ఈజిప్టు పిరమిడ్‌ల నిర్మాణానికి దాదాపు వందల సంవత్సరాల కాలం పట్టి ఉండవచ్చని చరిత్రకారుల అంచనా. సుమారు 138 పిరమిడ్‌లను వేర్వేరు ప్రాంతాలలో వేర్వేరు కాలాలలో నిర్మించారని తెలుస్తుంది. సాంకేతిక పరిజ్ఞానం అందుబాట్లో లేని రోజుల్లో భారీ యంత్రాలు ఎలా ఉంటాయో తెలియని కాలంలో ఈజిప్టు పిరమిడ్‌లను నిర్మించారు.



ఈజిప్టు రాజధాని కైరో నగరానికి యాభై కిలోమీటర్ల దూరంలో ఉన్న సక్కారా ప్రాంతంలో నుండి రమారమి 200 కి.మీ. దూరాన నెలకొని వున్న హవారా ప్రాంతం వరకు వివిధ కాలాలలో నిర్మించిన 138 పిరమిడ్లను లెక్కించి గుర్తించారు. వేల ఏళ్ల నాటి పిరమిడ్‌లు కావడంతో అనేకం శిథిలావస్థకు చేరుకున్నాయి. ప్రస్తుతం తొమ్మిది పిరమిడ్లు మాత్రమే ఈజిప్టులోని గీజా ప్రాంతంలో పర్యాటకుల్ని అబ్బురపరిచే స్థాయిలో గంభీరంగా కనిపిస్తూ సజీవ సాక్ష్యంగా నిలిచి వున్నాయి. ఈ పిరమిడ్లను తిలకించడానికి వెళ్లే ప్రారంభ మార్గంలో కాఫ్రే టెంపుల్‌ను దాటాల్సి ఉంటుంది. ఇదో అద్భుతమైన నిర్మాణం.

ఇక పిరమిడ్ల విషయానికి వస్తే గ్రేట్ పిరమిడ్ ఆఫ్ గిజా, గ్రేట్ పిరమిడ్ ఆఫ్ ఖుఫు ప్రధానమైనవి. కుఫు పిరమిడ్ 146.5 మీటర్ల ఎత్తు ఉంటుంది. ఈ పిరమిడ్ నిర్మాణానికి 35 లక్షల రాళ్లను ఉపయోగించారు. ఈ రాళ్లను దాదాపు ఇక్కడికి మూడు వందల కి.మీ. దూరం నుండి తీసుకువచ్చారని చరిత్ర చెబుతోంది. ఖుఫూ చక్రవర్తి సమాధిపై ఈ పిరమిడ్ నిర్మించగా అతని తనయుడైన ఖాఫ్రే సమాధిపై మరో పిరమిడ్ నిర్మించారు. ఇది 136.4 మీటర్ల ఎత్తును కలిగి ఉంటుంది. దీని నిర్మాణానికి 23 లక్షల రాళ్లను వినియోగించారు. ఈ పిరమిడ్ సింహికగా పిలుస్తున్న స్పింక్స్ వెనుక భాగంలో ఉంటుంది.

అనేక పరిశోధనలు చేసినప్పటికీ రాళ్లను అతికించడానికి ఉపయోగించిన పదార్థం ఏమిటనేది నేటికీ కచ్చితంగా కనుగొనలేకపోయారు. కాలగతిన పిరమిడ్ల పై భాగాన కొన వద్ద సున్నం తరిగిపోవడం వల్ల కొన్ని అంగుళాల ఎత్తు తగ్గినట్లు కూడా చెబుతున్నారు.

ఒక్కొక్క రాయి రెండు టన్నుల నుండి పదిహేను టన్నులకు పైబడి బరువైన రాళ్లు కూడా ఉన్నాయి. బరువైన అతి పెద్ద రాళ్లను పిరమిడ్ అడుగుభాగాన, చిన్న రాళ్లను పైభాగంలో ఉపయోగించారు. ఫరో చక్రవర్తులు చాలామంది బతికుండగానే తమ సమాధులను స్వయంగా తయారు చేయించుకుని వాటిపై ఈజిప్టు పిరమిడ్లను నిర్మించుకున్నారు. ఇక్కడ తండ్రి సమాధి కంటే కుమారుడి సమాధి ఎక్కువ ఎత్తు ఉండకూడదనే నియమం ఉంది. ఆ కారణంగా కొందరు కుమారులు వారి పాలనా కాలంలో నిర్మించుకున్న సమాధులను ఎత్తయిన ప్రదేశాల్లో నిర్మించుకున్నారు. అందువల్ల ఈ పిరమిడ్లు తమ తండ్రి సమాధికంటే ఎత్తు తక్కువగా నిర్మించినప్పటికీ నిర్మించిన ప్రదేశాన్ని బట్టి ఎత్తైనవిగా కనిపిస్తాయి. ఫిబ్రవరి, మార్చి నెలల్లో ఇక్కడ ఉష్ణోగ్రత తక్కువగా ఉంటుంది. ఆ కాలంలో పిరమిడ్లను తిలకించడానికి అనువైన వాతావరణం ఉంటుంది. పిరమిడ్ల బాహ్య భాగం చూడటానికి ఒక ధర టిక్కెట్లు ఉంటే, లోపలి భాగంలో ప్రవేశించి చూడటానికి ప్రత్యేక రుసుము చెల్లించాల్సి ఉంటుంది. పిరమిడ్ల లోపల ఇరుకైన మార్గం కావడం వల్ల చాలా చోట్ల వంగి నడవ వలసి ఉంటుం ది. అందువల్ల వయోభారం కలవారు లోపల నడవడం చాలా కష్టమౌతుంది. ఆ కారణంగా వయస్సు పైబడినవారు పిరమిడ్లలోకి ప్రవేశించడానికి సాహసించరు. ఒక పిరమిడ్ నుండి మరో పిరమిడ్కు వెళ్లడానికి రహస్య సొరంగ మార్గాలు కూడా నిర్మించారు. పిరమిడ్ల లోపల ఉన్న సంపదను కొన్ని వందల సంవత్సరాల క్రితం చాలా మంది దోచుకున్నారని చరిత్ర చెబుతోంది. రాజుల శవాలను భద్రపరచడానికి గ్రానైట్ రాయితో శవపేటికలు తయారుచేశారు.




ఆఖరుకు మృత్యుపేటికలపై కప్పును కూడా ఈ దారిదోపిడీదారులు తీసుకుపోయారని భావిస్తున్నారు. కొన్ని శవపేటికలు ఖాళీగా ఉండటం వల్ల ఇందులో భద్రపరచిన మమ్మీలు ఏమయ్యాయనే అనుమానాలు కూడా రేకెత్తిన సంఘటనలున్నాయి. ఇది మమ్మీలను భద్రపరచిన స్థలమేనా? లేక వేరేచోట మమ్మీలను భద్రపరచారా? మొదలైన అనుమానాలు కూడా కలిగాయి. దేనికీ సరైన సాక్ష్యాధారాలు లేవు. ఏది ఏమైనా పిరమిడ్లలో మమ్మీలను భద్రపరచిన స్థలంగా పేర్కొన్న చోటు వరకు పర్యాటకులు వెళ్లి చూడవచ్చు. పిరమిడ్లోని రాళ్లను కొందరు తీసుకుని వెళ్లి ప్రార్థనాలయాలు కూడా నిర్మించుకున్నారు. ఈజిప్టు పిరమిడ్ సగభాగం ఎక్కిన తరువాత మధ్యలో ఏర్పాటు చేసిన దారి ద్వారా పర్యాటకులు మమ్మీలను భద్రపరచిన స్థలానికి చేరుకోవచ్చు. ఈ మార్గంలో మెట్లు స్పష్టంగా కనిపించడానికి విద్యుద్దీపాలను ఏర్పాటు చేశారు. ఎంతో కష్టపడి, ఇరుకైన మార్గంలో వంగి నడచి రాజుల శవాలను భద్రపరిచే స్థానానికి చేరుకోవచ్చు. రాజుల శవాలను భద్రపరచిన ప్రదేశాన్ని కింగ్స్ ఛాంబర్ అని, రాణుల శవాలను భద్రపరచిన ప్రదేశాన్ని క్వీన్స్ ఛాంబర్ అని పిలుస్తారు. సమాధి గదిలో 'మమ్మీ ఫైడ్' అంటే మమ్మీగా తయారు చేసిన శవానికి దానిని భద్రపరచిన శవపేటిక(సర్కోఫగస్)లో వీలైనంత ఎక్కువ బంగారం, వెండిన అధిక పరిమాణంలో ఆహార పదార్థాలు, దుస్తులు ఉంచుతారు. కొన్ని సందర్భాలలో వ్యక్తిగత సేవకులను కూడా ఆ సమాధుల్లోనే ఉంచుతారు. ఆ ఫరోక్స్‌తో పాటు మరణానంతరం కూడా రాజుగారి సేవకులను వారి అవసరం ఉంటుందనే ఒక నమ్మకానికి ఇదో చిహ్నం. ఇలా శవపేటిక లను భద్రపరిచే సమాధి గదులు గోడలను వివిద పెయింటింగుల తోనూ, పిరమిడ్కు సంబంధించిన వంశవృక్షాలు అంటే ముత్తాత, తాత, తండ్రి, పిన తండ్రి ఇత్యాది వంశస్తుల వివరాలతో అలంకరిస్తారు. ఇలా గోడలపై అలంకరించడం వల్ల మరణించిన రాజు లేక రాణి పునరుజ్జీవితులు కావచ్చు లేదా మరణానంతరం కూడా జీవంలో ఉండే అవకాశం కలగవచ్చు అని అప్పటివారి విశ్వాసం. పిరమిడ్లోకి ప్రవేశించినప్పుడు ప్రారంభంలో ఒక మనిషి మాత్రమే నడవగల సన్నని దారి మాత్రమే ఉంటుంది. పిరమిడ్లో కొంత దూరం నడిచిన తరువాత రెండు మార్గాలలో రాకపోకలు సాగించవచ్చు. శవాలు భద్రపరచిన అతిపెద్ద హాలుగా కనిపించే ప్రదేశంలో గాలి రావడానికి చిన్న రంధ్రాలు కూడా ఏర్పాటు చేశారు. మమ్మీలను భద్రపరచిన హాలులా కనిపించే ప్రదేశం పైభాగంలో కొన్ని లక్షల కిలోల బరువైన రాళ్లతో పిరమిడ్ నిర్మించారు. ఆ కారణంగా ఈ ప్రదేశంలో నిలబడటం ఒక వింత అనుభూతిగా పర్యాటకులు భావిస్తారు.

**గ్రేట్ పిరమిడ్**

ఈజిప్టులోని గిజా ప్రాంతంలో నిర్మించిన గ్రేట్ పిరమిడ్ అన్నింటికంటే పెద్దది. ఈ పిరమిడ్ను క్రీ.పూ.2558లో నిర్మించారు. దీన్ని ప్రపంచంలో అత్యంత సాంకేతిక విలువలతో రూపొందించారు.

**(మిగతా 19వ పేజీలో)**



# అక్రమ శిఖరాలు!

**నోయిడాలో సూపర్‌టెక్ నిర్మించిన ట్విన్ టవర్స్‌ను ఇటీవల సుప్రీంకోర్టు ఆదేశాలతో కూల్చివేశారు. ఇలాంటి నిర్మాణాలకు అనుమతి ఇచ్చిన గత యూపీ ప్రభుత్వాల నిర్లక్ష్య ధోరణికి నిదర్శనం. రియల్ ఎస్టేట్ మాఫియాకు ఈ పరిణామం ఒక వార్నింగ్. అక్రమ నిర్మాణాలపై పోరు చేసి ఎన్నో ఒత్తిడులు, ఎన్నో ప్రలోభాలు చేసినా లొంగకుండా హైకోర్టు, సుప్రీంకోర్టులో కూడా విజయాన్ని సాధించింది నివాస సంక్షేమ సంఘం.**

కవర్‌స్టోరీ

**రుద్రరాజు శ్రీనివాసరాజు**

**ఒకటి** కాదు రెండు కాదు దాదాపు పది సంవత్సరాల పాటు నోయిడాలో సూపర్‌టెక్ నిర్మాణ సంస్థ నిర్మించిన బహుళ జంట అంతస్తుల భవన నిర్మాణాలపై ఒప్పందాలకు విరుద్ధంగా ప్రభుత్వ అనుమతులకు భిన్నంగా వ్యవహారించారని ఆ ప్రాంగణంలోని నివాసుల సంక్షేమ సంఘం 2012 నుండి పోరాటం ఆరంభించింది. న్యాయం కోసం అలహాబాద్ హైకోర్టు మెట్లు ఎక్కింది. నిబంధనల ప్రకారం ఈ బహుళ అంతస్థుల భవంతులు రెంటికీ మధ్య అంతరం 16 మీటర్లు ఉండాలి. అయితే వీటి విషయంలో అంతరం కేవలం 9 మీటర్లే. దీని కారణంగా దానిలో అనేక నివాసాలకు తగినంత గాలి, వెలుతురు రాని పరిస్థితి ఏర్పడిందంటూ న్యాయం చేయమని ఈ సంఘం న్యాయ స్థానాన్ని అభ్యర్థించింది. ఈ క్రమంలో ఒప్పందాలకు భిన్నంగా చేపట్టిన అవినీతి, అక్రమాలను గుర్తించిన అలహాబాద్ హైకోర్టు 2014లో ట్విన్ టవర్స్‌ను కూల్చివేయాల్సిందిగా ఆదేశించింది.

నివాస సంక్షేమ సంఘం ప్రభుత్వ అనుమతులకు పూర్తి విరుద్ధంగా ఆకాశాన్ని తాకే విధంగా బహుళ అంతస్తులుగా నిర్మించిన అక్రమ కట్టడాలపై రాజీ లేని పోరాటం చేశారు. వీరి పోరాట ఫలితంగా అలహాబాద్ హైకోర్టు ఈ ఆకాశ హర్మ్యాలు కూల్చివేయాలని తీర్పు వచ్చినా సుప్రీంకు వెళ్లి దానిని నిలుపుదల చేద్దాం అనుకున్న బిల్డర్ల కుటిల యత్నాలు సాగలేదు. సుప్రీం యథాతథంగా హైకోర్టు తీర్పును సమర్థించడమే కాకుండా దానికి స్పష్టమైన గడువు పెట్టి కూల్చివేతకు ఆదేశాలు ఇవ్వడంతో దేశ ప్రజలందరూ ఆనందిస్తున్నారు. వీరి విజయం అక్రమ నిర్మాణాలు చేపట్టే అక్రమ నిర్మాణ సంస్థల మాఫియాపైనే కాదు, నిర్మాణాల విషయంలో చట్ట నిబంధనలకు తూట్లు పొడుస్తూ ఏమాత్రం భయం, బాధ్యత లేని అవినీతి అధికారులకు కూడా ఒక హెచ్చరికగా చెప్పవచ్చు. చట్టాలు, నిబంధనలు అనేవి మన చేతిలో పావులు. వాటిని మనకు అనుగుణంగా మలుచుకోవచ్చు అనే రాజకీయ నాయకుల అండదండలతో బిల్డర్స్ మాఫియా ధైర్యంగా అక్రమ నిర్మాణాలు చేసుకుంటూ పోతూ ఉంది. ఈ ప్రయాణంలో అధికారులకు ముడుపులు చెల్లిస్తూ చట్ట విరుద్ధ అనుమతులు తెచ్చుకుంటున్నారు. లేదా మౌనంగా మిన్నకుండిపొమ్మంటున్నారు. ఒకవేళ ఈ అక్రమాలు వెలుగులోకి వస్తే క్రమబద్ధీకరణ పేరుతో కొద్దో గొప్పో ప్రభుత్వానికి చెల్లించి ఆమోద ముద్ర వేసుకోవచ్చు అనే భరోసా రియల్ ఎస్టేట్ బిల్డర్స్‌లో బలంగా పెనవేసుకుపోయింది.

ఈ పరిణామం సూపర్‌టెక్ లాంటి రియల్ ఎస్టేట్ కంపెనీలు సిగ్గుపడాల్సిన విషయం. నోయిడా అథారిటీ సిగ్గుతో తలదించుకోవాల్సిన పరిణామం. ఈ మొత్తం వ్యవహారంలో హైలెట్ ఏంటంటే..నోయిడా సెక్టార్ 93-ఎ పరిధిలో నిర్మించిన ఈ ట్విన్ టవర్స్ అక్రమంగా కట్టారని తేల్చినా ఈ కేసులో ఒక్కరూ కూడా జైలులో లేరు.

నోయిడా అథారిటీలోని 26 మంది అధికారులను ఈ అక్రమ నిర్మాణానికి సహకరించిన వ్యక్తులుగా ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) పేర్కొంది. నోయిడా ఫైర్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన ముగ్గురు అధికారులపై ఎఫ్ఐఆర్ కూడా నమోదైంది. ప్రస్తుతం నోయిడా అథారిటీకి చెందిన 11 మంది అధికారులు నిఘా నీడలో ఉన్నారు. శాఖాపరమైన చర్యలే తప్ప వీళ్లలో ఏ ఒక్కరూ చేసిన నేరానికి జైలులో లేకపోవడం గమనార్హం.

ఒకపక్క రాజకీయ అండదండలు మరొకపక్క తమ ఆర్థిక సామర్థ్యం రెండూ నెలకొన్న మనల్ని ఎవరూ అడ్డగించలేరు అనే ధీమా వీరిలో బాగా పెరిగిపోయింది. దీంతో ప్రత్యక్షంగా కళ్లముందు ఎన్ని అక్రమాలు కనిపిస్తూ వున్నా ప్రశ్నించే ధైర్యం సామాన్యులకు లేకుండా పోయింది. అధికారంలో ఉన్న రాజకీయ పక్షాలు చేసే ఈ భాగోతాలు ప్రతిపక్ష నాయకులకు తెలియక కాదు. అయితే తాము ఈ అక్రమాలపై ప్రశ్నించినా ఉద్యమించినా తాము అధికారంలో ఉన్నపుడు బిల్డర్ మాఫియాను తాము ఆదుకున్న ఘటనలను అధికార పక్షం బయటకు తీసుకువస్తుందనే భయంచేత ప్రతిపక్షాలు కూడా మౌనపాత్ర వహిస్తున్నాయి. ఈ క్రమంలో ఆక్రమణలకు అక్రమ నిర్మాణాలకు అడ్డూ అదుపూ లేకుం డా అప్రతిహతంగా కొనసాగుతూ పోతున్నాయి.

ఇదే నేపథ్యంలో ప్రభుత్వ నిబంధనల యథేచ్ఛ ఉల్లంఘనకు నోయిడా సూపర్‌టెక్ ట్విన్ టవర్స్ అతి పెద్ద ఉదాహరణ. ఎందుకంటే ఈ ట్విన్ టవర్స్ నిర్మాణం జన జీవనానికి దూరంగా రహస్యంగా కొండకోనల్లో లేదా దీవులలో జరిగింది మాత్రం కాదు. సాక్షాత్తు దేశ రాజధాని ఢిల్లీ శివారులో యూపీ పరిధిలోకి వచ్చే నోయిడాలో ఈ బహుళ అంతస్థుల భవనాల నిర్మాణం జరిగిపోయింది. అనుమతి పొందిన దానికి భిన్నంగా నిర్మాణాలు జరిగిపోయాయనేది పబ్లిక్‌గా ప్రజలు చెప్పుకుంటూ ఉన్నప్పటికీ బిల్డర్స్ ఏమాత్రం భీతి చెందలేదు. కళ్లెదుటే నిర్మాణాలు జరుగుతూ ఉన్నప్పటికీ కట్టడి చేసే అధికారులు మాత్రం అవినీతి మత్తు నిద్రలో జోగుతూ ఉన్నారు. ఫలితంగా భవనాలు ఆకాశ హర్మ్యాలు తాకుతూ పోయాయి. మన చేతిలో వ్యవస్థలు ఉన్నాయి కానీ వ్యవస్థల చేతిలో మనం లేం.. అనే ధీమా రియల్ ఎస్టేట్. బిల్డర్ మాఫియా వాళ్లకు ఉండటమే ఇటువంటి పరిస్థితులకు కారణంగా చెప్పవచ్చు. సుప్రీం తీర్పు ద్వారా 100 మీటర్లు ఎత్తు గల వివాదాస్పద జంట భవంతులను కూల్చడం అనేది చిన్న విషయం కాదు. దానికి రెసిడెంట్ అసోసియేషన్ సాగించిన ఉద్యమం అక్రమ నిర్మాణాలు చేపట్టినవారినే కాదు అవినీతి ఉద్యోగులకు కూడా ముచ్చెమటలు పట్టించాయి. రాజకీయ నాయకుల పరోక్ష మద్దతుతో భవన నిర్మాణ సంస్థ సూపర్‌టెక్ డెవలపర్స్‌తో చేతులు కలిపి నోయిడా అధికార యంత్రాంగం సాగించిన అవినీతికి కళ్లెదుటి సాక్ష్యమే నోయిడా ట్విన్ టవర్స్.

అనుమతి పొందిన ఎత్తుకు, నిర్మించిన ఎత్తుకు ఎక్కడా పొంతన లేకుండా ఆకాశాన్ని తాకే విధంగా నిర్మించారు. మరొక ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే– ఈ ట్విన్ టవర్స్ ఎత్తు పొరుగునే దేశ



రాజధాని ఢిల్లీలోని చరిత్రాత్మక కుతుబ్ మీనార్‌ను మించిపోయింది. కానీ అధికారులకు ముడుపుల మత్తులో చూపు మసకబారి భవనాల ఎత్తు ఏమాత్రం వారికి కనిపించలేదు. హైకోర్టు, సుప్రీంకోర్టు కూడా నిబంధనల అతిక్రమణలు స్పష్టంగా గుర్తించింది. ఇంతలా నిర్మాణాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారుల అలసత్వాన్ని ప్రశ్నించి రియల్ ఎస్టేట్ రంగం ఊహించని విధంగా జంట అంతస్థులను కూల్చివేయాలని తీర్పు ఇచ్చింది. అయితే ట్విన్ టవర్స్‌లో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఒక్క భవనాన్ని కూల్చివేసేలా తీర్పును మార్చాలంటూ కంపెనీ వేడుకుంది. ఈ అవకాశం ఇస్తే మిగిలిన ఒక్క భవనాన్ని పర్యావరణ నిబంధనలకు అనుగుణంగా మార్పులు చేస్తామంటూ బతిమాలింది. భవన నిర్మాణానికి కోట్ల రూపాయలు ఖర్చు అయ్యాయని, ఎంతో సిమెంటు, స్టీలు వినియోగించామని అదంతా వృథా అవుతుందని పేర్కొంది. రెండు భవనాలను కూల్చేస్తే శిథిలాలతో ఆ ప్రాంతం నిండిపోతుందని పేర్కొంది. మొత్తంగా చేసిన తప్పును ఒప్పుకుని శిక్షలో మినహాయింపు ఇవ్వాలని వేడుకుంది. అయినా న్యాయస్థానం తన తీర్పులో మార్పు లేకుండా పైగా ఈ తీర్పులో కూల్చివేతకు అయ్యే ఖర్చు 20 కోట్ల రూపాయలు కూడా కంపెనీ చెల్లించాలని ప్లాట్లు అమ్మిన వారికి 12 శాతం వడ్డీతో చెల్లించాలని ఆదేశించింది.

ఈ తీర్పు దేశంలో సంచలనమైంది. అక్రమ దందాలు జరిపే అక్రమార్కులకు ఇది హెచ్చరికగా నిలిచింది. అయితే నోయిడాలో జంట టవర్ల కూల్చివేతపై స్థానికులు రకరకాలుగా స్పందిస్తున్నారు. నిర్మాణంలో అక్రమాలు జరిగితే పడగొట్టకుండా ప్రత్యామ్నాయ మార్గం ఏదైనా ఆలోచించి ఉంటే బాగుండేదని కారణాలు ఏవైనా ఇంత పెద్ద భవనాలు పడగొట్టకుండా నివాసం లేనివారికి నివాసాలు కల్పిస్తే బాగుండేదని కొందరు అభిప్రాయపడుతున్నారు. అయితే ఇటువంటి అక్రమాలకు చరమ గీతం పాడి అక్రమార్కుల గుండెల్లో భయాన్ని కలిగించాలి అంటే కూల్చివేత నిర్ణయం సమంజసమని ప్రజాస్వామ్య వాదులు సమర్థిస్తున్నారు. నోయిడా తరహా అక్రమ నిర్మాణాలు దేశంలోని వివిధ రాష్ట్రాలలో అనేకం ఉన్నాయి. అయితే బయటకు తెలిసేవి కొన్ని మాత్రమే. ఒకవేళ బయటపడినా అటువంటి వాటిపై న్యాయ పోరాటం చేయడానికి ముందుకు వచ్చేవాళ్లు లేకుండా పోయారు. బిల్డర్ మాఫియాను ప్రభుత్వ నిబంధనలు ఏమీ చేయలేవు. నిబంధనలకు అనుగుణంగా కట్టడాలు చేస్తున్నాం అంటూ కాగితాలపై అందంగా చూపిస్తారు. కానీ క్షేత్ర స్థాయిలో ఇది పూర్తి భిన్నంగా ఉంటుంది. రాజకీయ అండదండలతో అధికారులను ప్రలోభాలతో నోరు నొక్కి ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ ఇష్టారాజ్యంగా బహుళ అంతస్థుల భవనాలు, బడాబాబుల విల్లాలు, భారీ అపార్ట్‌మెంట్లు కట్టడం ఇప్పుడు చాలా సాధారణ విషయంగా మారిపోయింది. ఇప్పుడు దేశంలో పెరిగిపోతున్న ఆక్రమణలు అక్రమ నిర్మాణాలు రియల్ ఎస్టేట్ దందాలు మోసపోతున్న ప్రజలు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు గమనిస్తే–

### ఆక్రమణలు.. వరదలు

స్థలాల ఆక్రమణ అనేది ఎప్పటినుంచో జరుగుతూ వున్నప్పటికీ నేడు దేశంలో అది ఒక మాఫియాగా తయారైంది. సాధారణంగా ప్రభుత్వ భూముల విషయంలో దేవస్థానాల భూముల విషయంలో ఆక్రమణలు జరుగుతూ ఉండటం మనకు తెలుసు. ప్రభుత్వ పెద్దల సహకారంతో కానీ ప్రభుత్వ అధికారుల నిఘా లేకపోవడం వల్ల జరిగే ప్రక్రియ ఇది. అయితే ఈ ఆక్రమణల అక్రమాలు ప్రభుత్వ భూములకు మాత్రమే కాదు.. పట్టణాలలో, నగరాలలో ఈ దందా ప్రయివేటు భూముల వైపు కూడా మళ్లింది. రాజకీయ బలంతో మాఫియా బృందాలు తోడ్పాటుతో రాయితీ భూములను కలిగి బలహీనులు అనిపించినవారి నుండి బలవంతంగా భూములను ఆక్రమించడం నేడు చాలా సహజమైపోయింది. అవసరం అయితే కిడ్నాపులు, బెదిరింపులు, హత్యలు కూడా చేస్తూ బలవంతంగా కొనుగోలు చేయడం లేదా నిర్దాక్షిణ్యంగా ఆక్రమించడం నేడు చాలా చోట్ల కనిపిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాలలో మాత్రం చాలా వరకు ఇటువంటి ఆక్రమణలు అనేవి నివాసాల కోసం నదుల కరకట్టల మీద కాలువల సమీప ప్రాంతాల్లో నాలాలు, చెరువు ప్రాంతాల్లో కనిపిస్తూ ఉంటాయి. పట్టణ ప్రాంతాలలో మాత్రం కరకట్టలు నాలాలు చెరువులను ఆక్రమించి విలాసవంతమైన భవనాలు, వ్యాపార సంస్థలను నిర్మిస్తున్న దాఖలాలు నిత్యం దేశ వ్యాప్తంగా కనిపిస్తున్నాయి. 2013లో ఉత్తరాఖండ్‌లో వరదలు, 2018లో కేరళలో భయంకరమైన వరదలు చూశాం. కళ్లముందే ఇళ్లకు ఇళ్లు, ఊళ్లకు ఊళ్లు కొట్టుకొనిపోయాయి. పెద్ద పెద్ద భవనాలు నేలకూలాయి. 2015లో చెన్నై, 2019లో ముంబైలో భారీ వర్షాలు సృష్టించిన జల విలయం అంతా ఇంతా కాదు. భారీ వర్షాలే కాదు, ఒక మాదిరి వర్షాలకు కూడా హైదరాబాద్ వంటి మహానగరంలో వందల సంఖ్యలో కాలనీలు, వేలకొద్దీ ఇళ్లు ముంపులో ఉంటున్న విషయం తెలిసిందే. ఈ విపత్తులకు ప్రకృతి ప్రకోపం కన్నా ఆక్రమణలే ప్రధాన కారణమని చెప్పవచ్చు. ఎందుకంటే చెరువులు, కాలువలు, నదులు, వాటి పరిరక్షణకు ఉన్న గట్లు, పరీవాహక ప్రాంతాలు నిత్యం సర్వం ఆక్రమణల బారిన పడుతున్నాయి. చెరువులు, కాలువల్లోనే కాదు చివరకు నదీ గర్భాల్లోకి వెళ్లి మరీ అక్రమణ నిర్మాణాలు చేస్తున్నారు. అధికారులు మాత్రం కాసుల వేటలో చేష్టలుడిగి చూస్తున్నారు. ఈ పరిస్థితి ఏనాడో గ్రహించిన బ్రిటీష్ ప్రభుత్వం 1884న రివర్ కన్జర్వెన్సీ యాక్టును అమలులోకి తెచ్చింది. దీని ప్రకారం నదీ ప్రవాహాలకు అడ్డుగా ఎటువంటి శాశ్వత కట్టడాలు కట్టకూడదు. తాత్కాలికంగా చేపట్టే నిర్మాణాలైనా సంబంధిత ఇరిగేషన్ హెడ్‌వర్క్స్ అధికారుల అనుమతి ఉండాలి. అలాగే వరదల సమయంలో కాపాడేందుకు నిర్మించిన ఏటిగట్లను ఆనుకుని నదీ గర్భం వైపు వంద మీటర్ల పరిధిలో ఎటువంటి తవ్వకాలు చేయకూడదు. నది వంపు తిరిగే ప్రాంతాల్లో 150 మీటర్ల వరకు తవ్వకాలు చేయకూడదు. ఇటువంటి నిబంధనలు



ఉన్నాయని సామాన్య జనానికే కాదు, ఇరిగేషన్ అధికారులు కూడా పూర్తిగా తెలియదంటే అతిశయోక్తి కాదు. తెలిసినా ఇప్పుడు పట్టించుకునేవారు లేరు. మరొక చిత్రం ఏమిటంటే సామాన్యులు, రియల్టర్లే కాదు.. ప్రభుత్వాలు సైతం పర్యాటకం పేరుతో నదీగర్భాలలో అక్రమ కట్టడాలకు అనుమతులు ఇవ్వడం గమనించదగిన విషయం. దేశంలో ప్రతి చోట నదులు, చెరువులు, కాలువలు ఆక్రమణలకు గురి అవుతూనే ఉన్నాయి.

### సూపర్‌టెక్‌కు నష్టం ఎంత అంటే?

నోయిడాలో జంట భవనాల కూల్చివేతపై సూపర్‌టెక్ ఛైర్మన్ ఆర్‌కే అరోడా మాట్లాడుతూ ఈ కూల్చివేతల ద్వారా తమ కంపెనీకి రూ.500 కోట్లు నష్టం వాటిల్లిందని వెల్లడించారు. ఈ జంట భవనాల నిర్మాణం, వడ్డీరేట్లు తదితరాలన్నింటితో కలుపుకొంటే తమ సంస్థకు ఆ మేరు నష్టం వాటిల్లినట్లు చెప్పారు.

➤ సూపర్‌గటెక్ ఎమరాల్డ్ కోర్ట్ ప్రాజెక్ట్‌లో ఒక 3బిహెచ్‌కె అపార్ట్‌మెంట్ ధర దాదాపు రూ.1.13 కోట్లు. ఈ రెండు భవనాల్లో దాదాపు 915 ఫ్లాట్లు ఉన్నాయని, వాటి ద్వారా కంపెనీకి దాదాపు రూ.1,200 కోట్ల ఆదాయం వచ్చేది.

➤ మొత్తం 915 ఫ్లాట్లలో దాదాపు 633 ఫ్లాట్‌లు బుక్ చేయబడ్డాయి, కంపెనీ గృహ కొనుగోలుదారుల నుండి దాదాపు 180 కోట్ల రూపాయలు వసూలు చేసింది. ఇప్పుడు, సూపర్‌టెక్‌ని 12 శాతం వడ్డీతో గృహ కొనుగోలుదారులకు తిరిగి చెల్లించాలని కోరింది.

➤ ఇది కాకుండా పేలుడు సమయంలో చుట్టుపక్కల ఏమైనా డ్యామేజ్‌లు జరిగితే... ఇందుకోసం బిల్డింగ్ కూల్చివేత బాధ్యతలను తీసుకున్న ఎడిఫైస్ ఇంజినీరింగ్ కంపెనీ రూ.100 కోట్ల ఇన్సూరెన్స్‌కు వెళ్లింది.

➤ కూల్చివేతకు అయ్యే మొత్తం కాస్ట్ అక్షరాల రూ.20 కోట్ల రూపాయలు.

➤ నేషనల్ బిల్డింగ్ కోడ్ (ఎన్‌బీసీ) ప్రకారం గృహ నివాస భవనాల మధ్య కనీసం 16 మీటర్ల దూరం వుండాలి. కానీ ఎపెక్స్‌కు, పక్కనే ఉన్న ఎమరాల్డ్ కోర్టులోని టవర్‌కు మధ్య 9 మీటర్ల దూరం కూడా ఉంచలేదు. ఆ దూరం ఉండి వుంటే ఇప్పుడు ఇంత భారీ విధ్వంసానికి తెర లేచేదే కాదు.

➤ కుతుబ్‌మినార్ కంటే ఎత్తయిన ఈ జంట భవనాల కూల్చివేతను దేశంలోనే ఇప్పటిదాకా ఎత్తయిన భవనాల కూల్చివేతగా చెప్తున్నారు. అందుకే ఈ కూల్చివేత ఒక చారిత్రక ఘట్టంగా దేశ చరిత్రలో నిలిచిపోనుంది.

### అక్రమ నిర్మాణాలు

భవన నిర్మాణాలకు స్థానిక సంస్థలు అనుమతులు అనేవి తప్పనిసరి. వాటి పరమార్థం ప్రభుత్వ ఆదాయం కోసం అని మాత్రమే కాదు. గ్రామం, పట్టణం, నగరాలలో ఒక క్రమబద్ధమైన అభివృద్ధి సాధించడమే దీని ప్రధాన లక్ష్యం. అంతేకాదు, నిర్మాణాలపై పూర్తి అవగాహన ప్రభుత్వానికి వస్తే దానికి అనుగుణంగా నీరు, డ్రైనేజీ సదుపాయాలు, రోడ్డు సదుపాయాల విషయంలో ఒక పద్ధతి ప్రకారం అభివృద్ధి సాధించవచ్చు. అది లోపించిననాడు ఎవరి అభీష్టానికి వారు నిర్మాణం చేస్తూ పోతే ఒక పద్ధతి ప్రకారం నివాసాల ఏర్పాటు జరగదు. అనుమతులను అతిక్రమించి అంతస్తులపై అంతస్తులు నిర్మించుకుపోవడం అనేది పట్టణాల్లో నగరాల్లో చాలా సాధారణ విషయమైంది. ఈ అతిక్రమణలు అనేవి అధికారులకు తెలియక కాదు, వారికి ముడుపులు లభిస్తే మౌనంగా ఉండిపోవడం అత్యంత సహజం.

అనుమతులు తీసుకురావడానికి అక్రమమైంది కూడా సక్రమం అని చూపడానికి ప్రత్యేకంగా అనేకమంది పైరవీకారులు ఉంటారు. వీరి ద్వారా భారీ ముడుపులు అందిస్తూ భవన నిర్మాణ అనుమతులు తెచ్చుకుంటున్నారు, దర్జాగా భవంతులు నిర్మిస్తున్నారు. అనుమతుల కోసం సమర్పించిన బిల్డింగ్ ప్లాన్ ఒకటైతే క్షేత్ర స్థాయిలో దానికి భిన్నంగా జరిపే నిర్మాణాలు కోకొల్లలు. అనుమతులే తీసుకోకుండా నిర్మించే భవంతులు కూడా తక్కువేం కాదు. అనుమతి లేకుండానే గతంలో ఉన్న భవనాల అంతస్తుల పెంపు, సెట్‌బ్యాక్ వదలకపోవడం, సెల్లార్, పార్కింగ్ స్థలంలో షాపింగ్ కాంప్లెక్సుల నిర్మాణం..అలాగే పలుచోట పాత భవనాలను ఎలాంటి అనుమతి లేకుండానే వాణిజ్య సముదాయాలుగా మారుస్తున్నారు. మున్సిపాలిటీల్లో జీ ప్లస్ 2 కోసం మాత్రమే అనుమతి తీసుకుని జీ ప్లస్ 4 అంతస్తులు నిర్మిస్తున్నారు. పైగా గ్రౌండ్ ఫ్లోర్లలో అనుమతి లేకుండానే షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నారు. ఇలా ఇష్టారీతిగా నిర్మాణాలు చేపడుతున్నా అధికారుల దృష్టికి రానట్లు వ్యవహరిస్తున్నారు. దీనికి టౌన్ ప్లానింగ్ విభాగంలో సిబ్బంది కొరత, తాత్కాలిక సిబ్బంది చేతివాటం, పైరవీకారుల వల్ల అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయన్న ఆరోపణలున్నాయి.

## అక్రమ వెంచర్లు

నివాస యోగ్యంగా ఉండే భూములకు మాత్రమే వెంచర్లు వేయడానికి మున్సిపాలిటీలు, గ్రామ పంచాయితీల నిబంధనల మేరకు అనుమతి ఇస్తారు. ఒకవేళ వ్యవసాయ భూముల్లో వెంచర్లు ఏర్పాటు చేయాలంటే మొదట వాటిని నివాస స్థలాలుగా మార్చుకోవాల్సి ఉంటుంది. ఇందుకు నిర్ణీత రుసుం చెల్లిస్తూ సంబంధిత అధికారులకు నాలా కన్వర్షన్ కోసం దరఖాస్తు చేసుకోవాలి. నాలా కన్వర్షన్ అనంతరం లే అవుట్ అనుమతులు సంబంధిత మున్సిపాలిటీ లేదా గ్రామ పంచాయితీ నుంచి తీసుకోవాలి. అయితే ఇవేమి లేకుండానే రియల్ ఎస్టేట్ వ్యాపారులు వ్యవసాయ భూములలో అక్రమంగా వెంచర్లు ఏర్పాటు చేస్తూ నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. దీనివల్ల ప్రభుత్వ ఆదాయానికి పెద్ద ఎత్తున గండి పడుతుండగా అదే సమయంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు మాత్రం కుబేరులు అవుతున్నారు. అధికారుల నుంచి నాలా కన్వర్షన్ అనుమతులు రాగానే లే అవుట్ కోసం మున్సిపాలిటీ, గ్రామపంచాయితీలకు దరఖాస్తు చేసుకోవాలి. ఇందుకుగాను నిర్ణీత స్థలంలో నుంచి 10 శాతం భూమిని పార్కుల నిర్మాణం, ఇతర అవసరాలకు అప్పగించాల్సి ఉంటుంది. ఇవి పాటించని వెంచర్లు ఎన్నో ఉన్నాయి. వీటికి రిజిస్ట్రేషన్లు జరిపే అవకాశం లేదని చెప్పినా కూడా అడ్డదారిలో రిజిస్ట్రేషన్లు చేస్తున్న దాఖలాలు కూడా లేకపోలేదు.

## నాలా చట్టం

ఒకప్పుడు నగరాలు, పట్టణాలు, జిల్లా కేంద్రాలకు మాత్రమే పరిమితమైన రియల్ ఎస్టేట్ వాతావరణం గ్రామాలకు బాగా విస్తరించింది. దీనికోసం వ్యవసాయం భూములను వ్యవసాయేతర భూములుగా వాడుకోవడం బాగా పెరిగిపోయింది. దీనికి సంబంధించి ప్రభుత్వం ఒక ప్రత్యేక చట్టం ఉన్నా చాలా వరకు ఈ పద్ధతిని



పాటించకుండానే వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూములుగా మార్చేస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్రంలో 1963లో మొదటిసారి వ్యవసాయేతర భూములపై అదనంగా శిస్తు విధించడానికి ఒక చట్టం చేశారు. మళ్లీ 2006లో కొత్త చట్టాన్ని రూపొందించారు. ఈ చట్టం పేరు వ్యవసాయ భూములు వ్యవసాయేతర అవసరాల కోసం మార్పు చేసుకునే చట్టం-2006.

## రెరా చట్టం

స్థిరాస్తి కొనుగోలుదారుల హక్కుల పరిరక్షణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ: రెరా చట్టం తెలంగాణ రాష్ట్రంలో 2018 ఆగస్టు 31 రెరా అమల్లోకి వచ్చింది. 500 చ.మీ. అంతకంటే ఎక్కువ విస్తీర్ణంలో చేపట్టే ప్రాజెక్టు లేదా 8 అంతకంటే ఎక్కువ ప్లాట్లు నిర్మించే ప్రాజెక్టుకు ఈ చట్టం అనుమతి తప్పనిసరి. ఇది లేకుండా ప్రీ లాంచ్ లేదా విక్రయాలు చేయకూడదు. స్థిరాస్తి రంగంలో పారదర్శకత, కొనుగోలుదారుల హక్కుల పరిరక్షణ, కొనుగోలుదారులు-రియల్ సంస్థల మధ్య వివాదాల సత్వర పరిష్కారం, రియల్ వెంచర్‌కు సంబంధించిన పూర్తి సమాచారం కొనుగోలుదారులకు అందుబాటులో ఉండటం వంటి కీలకాంశాలతో రెరా ముడిపడి ఉంది. 2017 జనవరి ఒకటో తేదీ తర్వాత ప్రారంభమై చట్టం పరిధిలోకి వచ్చే అన్ని వెంచర్లను రెరా కింద నమోదు చేసుకోవాలని ప్రభుత్వం నిర్దేశించింది.

## రియల్ ఎస్టేట్ రంగానికి అర్హతలు

రియల్ ఎస్టేట్ రంగం అంటే ఏమిటి? దానిని నిర్వహించేవారి అర్హతలు ఏమిటి? అనేదాని విషయంలో ఏ విధమైన నిబంధనలు లేకుండా పోయాయి. దీంతో ఈ రంగంలో ఏ అనుభవం లేకపోయినా తమ నల్ల ధనాన్ని తెల్ల ధనం చేసుకోవడానికి వచ్చేవారి సంఖ్య అత్యధికంగా ఉంది. ఇటువంటి వారి దృష్టి అంతా అక్రమాలు చేస్తూ ఏ విధంగా అధిక లాభాలు ఆర్జించాలి అనే దానిపైనే ప్రత్యేక దృష్టి ఉంటుంది తప్ప ప్రాజెక్టును ప్రతిష్ఠాత్మకంగా తీర్చిదిద్దాలి అనే ఆలోచన కలిగినవారు చాలా అరుదుగా ఉంటారనే చెప్పవచ్చు. ఇటువంటి వారికి నమ్మి పెట్టుబడులు పెట్టిన కొనుగోలుదారులు నిండా మునిగిపోతున్నారు. ఈ తరహా వివాదాలు రేరా చట్టంతో సమసి పోతుందని భావించారు. కానీ వాస్తవంలో అలా జరగడం లేదు.

## ప్లాట్లు కొనేముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

గ్రామాల్లో ఇళ్ల స్థలాలు కొనుగోలు చేసి ముందు సంబంధిత యజమానుల పేరు రెవెన్యూ, పంచాయితీ రికార్డుల్లో సరిచూసుకోవాలి. సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ఈసీ పత్రం పరిశీలించుకోవాలి. భూమిపై ఏదైనా వివాదం ఉందా? అనే విషయం తెలుసుకోవాలి. పంచాయితీ లే అవుట్ అనుమతి ఉన్న ప్లాట్లనే కొనుగోలు చేయాలి. వ్యవసాయ భూమిలో ఏర్పాటు చేసిన ప్లాట్లకు నాలా అనుమతులు ఉన్నాయో లేదో చూసుకోవాలి. ఏది ఏమైనా... నోయిడా జంట బహుళ అంతస్తులు వంటి అక్రమ నిర్మాణాలు మరిన్ని కూల్చివేయగలిగిననాడు బిల్డర్స్ మాఫియా అక్రమాలకు అడ్డుకట్ట వేసే అవకాశం కలుగుతుంది. నోయిడా ట్విన్ టవర్స్ విషయంలో సుప్రీం తీసుకున్న కఠిన నిర్ణయం ప్రభుత్వాలు అధికారులు చిత్తశుద్ధితో అమలు పరచిన నాడు అక్రమ నిర్మాణాలు నిలుపుదల చేయడం ఏమంత కష్టం కాదనే విషయం అందరూ గుర్తించాలి. ❑

# నిశ్శబ్ద రాత్రి..



ఒకానొక నిశ్శబ్ద రాత్రివేళ..
ఏకాంతంగా నేనున్నపుడు
సడీసప్పుడు లేకుండా నువ్వొచ్చి
ఓ కౌగిలింతనిచ్చిపో ప్రియా..
అవునన్నట్టు.. గుర్తెట్టుకో..
నువ్వొచ్చేపుడు నీ అడుగుల సప్పుడు
కూడా
భూమాత చెవులకు చిక్కకుండా
చూసుకో..
తానిప్పుడు చెవులు నిక్కపొడుచుకుని
ఉంటుంది మరి.
అనుకోని నీ కౌగిలింతకు/ పరధ్యానంలో నేనున్నపుడు
కాసింత ప్రేమ పరిమళం చల్లిపో సఖీ...
అవునోయ్.. మర్చిపోకు...
నీవు చిలకరించే ఆ సువాసన
ఆ గాలిగాడి ముక్కుపుటాలను తాకకుండా చూసుకో
వాడసలే ఈ యేలా
నాసికా ద్వారాలు బార్లా తెరుచుకుని ఉంటాడు కాబోలు.
నీ ప్రేమ పరిమళపు/ పరవశంలో నేనున్నపుడు
ముద్దుగా ఓ ముద్దిడిసిపో చెలీ..
ఓయ్... జాగ్రత్త సుమీ....
ముద్దిడిసే వేళా నెలరాజు కంటపడకుండా చూసుకో..
ఆ వెన్నెల రేడిపుడు
గూఢచారివోలే గుడ్లప్పగించి చూస్తుంటాడు మరీ..

**- దిలీప్.వి**

---

## ఈ వారం కవిత్వం

# అస్తిత్వపు ఘోషలు

ఒక భ్రమణాన్ని
ఒక జీవనయానం గుర్తిస్తుంది
జీవన చక్రంలో
ఆవేశపడ్డ బలం గర్జిస్తోంది.
చతికిలపడ్డ ప్రాణుల ఘోష వినబడుతోంది.
అధికారపు దాహపు ధ్వనుల్లో
ఆక్రమణలు పరాక్రమాలుగా దుముకుతున్నాయి.
వక్రీకరించిన మతసిద్ధాంతాల్లో ఊగినపుడు
గుణంలేని కులం నరాలు చీలుస్తున్నప్పుడు
సోమరితనం ముసుగులు తొడిగినపుడు
స్వార్థపు దాడులు తెగబడుతుంటాయి.
అశాంతి చిత్రంలో
చెక్కబడ్డ అసంతృప్తి తీరాలు
బతుకుల్ని ఛిద్రం
చేస్తున్నాయి.
కన్నులు తొలిచే
ఉగ్రవాదంలో జీవికలు
మునుగుతున్నాయి.
వ్యూహ ప్రతి వ్యూహాల్లో
చెల్లా చెదురైన ఆర్తనాదాలుగా
బతుకులు కూలిపోతున్నాయి.
వాలిన చరిత్ర సాక్షిగా
క్రమశిక్షణ పాఠం
రుచి చూడని
మానవాళి విధ్వంస
దృశ్యాల్ని
తట్టి లేపుతుంది.
ఐక్యత లేని రాజ్యం
అస్తిత్వపు ఘోషలు
విలపిస్తుంటాయి.



**- గవిడి శ్రీనివాస్**

# పుస్తక సమీక్ష

## పఠనీయం..ఆచరణీయం




బహు గ్రంథకర్త రుద్రాక్షలమఠం ప్రభులింగశాస్త్రి 40 ఛందోబద్ధ పద్యములు మరో నలభై వచన కవితలతో 'పలక' పేరిట ఓ పద్య, వచన కవితా సంపుటిని ప్రకటించారు. 'పలక'పై అక్షరాలను దిద్దుకోని వారు బహుశా వుండరేమో! 'పలకను చేతబట్టి బలపమ్మును యక్షరమవ్వునట్లు/ పంతులు చెబుతుండగా పలుకుతూ తొలినాడున దిద్దినట్టి నా/ కలతలు లేని నా దినము కన్నుల ముందు సచిత్ర రూపమై/ లలిగ సదా మనస్సును విలాసమునందున నుంచసాగెనా?'/ ఎప్పుడో చిన్నప్పుడు చేతబట్టిన పలక ఎంతకాలం గడిచినా కవి కళ్ల ముందు సాక్షాత్కరిస్తూ ఆయన మనస్సున చిరునామాగా మిగిలిపోయిందట. చంపకమాల పద్యం యిది. పద్యాల కింద తాత్పర్యాన్ని కూడా జోడిస్తే పాఠకులకు మరింత చేరువయ్యేది శాస్త్రిగారి సాహిత్యం. మరో కవితలో 'నేనేర్చిన భాషా పదాలన్నింటి/ పద అర్థాలు పుట్టిన క్షేత్రమడి' అంటూ పలకను వర్ణిస్తారు. 'ఆ పలక ఈనాడు చెంతలేకున్న/ నా 'మనోఫలకం'పై శాశ్వతమైంది' అంటూ తొలి అక్షరాలు దిద్దించిన పలక తన మనస్సుపై చెరగని ముద్ర వేసిందని వ్యాఖ్యానిస్తారు. వీరశైవ ప్రభావాన్ని సమన్వయం చేస్తూ శ్రీరాముని వ్యక్తిత్వం వర్ణించిన తీరు శాస్త్రి లోతైన అవగాహనను పట్టియిస్తుంది. అనేకానేక సామాజికాంశాలను వస్తువులుగా స్వీకరించి ఆధ్యాత్మికతను పూరించి ఆణిముత్యాల్లాంటి పద్యాలు, కవితలు అందించారు. వ్యక్తిత్వ నిర్మాణానికి దోహద పడే 'పలక' పొత్తం నిత్య పఠనీయం..ఆచరణీయం. **(పలక: రచన: రుద్రాక్షలమఠం ప్రభులింగశాస్త్రి, వెల: రూ 252, ప్రతులకు: 3-132, బాలాజినగర్, మహబూబ్‌నగర్)** **- రమణ వెలమకన్ని**

## 'మానవత్వం మేల్కొన్న వేళ' కథల సంపుటి



డా॥ ముదిగొండ శివప్రసాద్, డా॥ తెన్నేటి సుధాదేవిలు ఈ కథలపై చక్కటి విలువైన ముందుమాట రాసారు. రచయిత 4 దశాబ్దాలుగా కథారచనలో విశేషకృషి చేసారు. ఈ కథాసంపుటిలో 23 కథలున్నాయి. ఓ తండ్రి క్షోభ, ఒకే చెట్టుకొమ్మలు, బాబాయ్, షూరిటీ, అపార్థం, సంఘర్షణ-దెబ్బకుదెబ్బ..పరివర్తన లాంటి కథలు పాఠకుల్ని బాగా ఆలోచింపచేస్తాయి. తనను పట్టించిన వారికి బహుమతి 2 లక్షలు ప్రకటన చూసి తనకు షెల్టర్ ఇచ్చిన అమరనాథ్ కుటుంబానికి ముద్దాయి గణపతి చేసిన సాయం..తెలియజేసిన కథ 'మానవత్వం మేల్కొన్న వేళ'. ఇదే శీర్షికకు కథా సంపుటికి పెట్టారు. జాతీయ సమైక్యతకు అద్దం పట్టే మంచికథ.

'ఒకే చెట్టు కొమ్మలు'. ఈ కథ హిందూ ముస్లిం యువకుల ఘర్షణ- గాయపడిన వారికి వైద్యం చేసిన క్రైస్తవ నర్సు ఆ యువకులకు సామరస్యం కుదుర్చిన బలమైన సన్నివేశాలు గల మంచి కథ. మోడలింగ్‌పై మోజుగల కుమార్తెకు ఆ వృత్తిని వ్యతిరేకించే తండ్రికి మధ్య గల విబేధాలు, తండ్రి ఆవేదనను, ఆర్ధ్రతో అద్భుతంగా రచయిత అక్షరీకరించిన తీరు పాఠకుల్ని కదిలిస్తుంది.

**(మానవత్వం మేల్కొన్న వేళ, రచన: దేశిరాజు లక్ష్మీనరసింహారావు, వెల: రూ299, ప్రతులకు: నవోదయ బుక్‌హౌస్)**

**- తంగిరాల చక్రవర్తి**

'సూర్య ప్రభాపతి'గా, తనను తాను పేర్కొంటూ ఒక భర్త, భార్యను దేవతా సమానంగా ఆరాధించడం హృదయనైవేద్యంగా ఆత్మకథ ప్రచురించటం అరుదైన అంశం. భోగరాజు సత్యనారాయణ, సూర్యప్రభ దంపతులు భారతీయ వివాహ వ్యవస్థ ఔన్నత్యాన్ని ప్రపంచానికి విశదపరిచే ఆదర్శదంపతులుగా అంతర్జాతీయ గౌరవ

## భోగరాజు వారి హృదయ నైవేద్యం



పురస్కారం, 'సకల కళానిధి' గుర్తింపు సాధించారు. కర్తవ్యం పేరిట తమ జీవిత విశేషాలు, 27 ఆణిముత్యాల వంటి సద్విషయాలను ఆదర్శ దంపతులుగా, ఇరువురూ కలిసి సాధించిన జీవిత కాల సాఫల్యాలను మార్గదర్శకులుగా అందించారు. తీర్థయాత్రలు, శ్రీరామ కోటిలేఖనం, యోగసాధన, వంశవృక్షాలు, కర్తవ్య నిష్ఠతో ఆచరించి ఆదర్శనీయులయ్యారు. డాక్యుమెంటరీ డైరక్టర్, కృష్ణాదువ్వూరి ప్రపంచంలో భారతీయ వైవాహిక వ్యవస్థ మహోన్నతను ప్రతిబింబింప చేసేవిధంగా ప్రప్రథమంగా ఈ దంపతులపై డాక్యుమెంటరీ నిర్మించారు. ప్రముఖ రచయిత కొవ్వరి నాగేశ్వరరావు సూర్యప్రభావతి భోగరాజు సత్యనారాయణ జీవిత విశేషాలపై గ్రంథం వెలువరించారు. భోగరాజు సత్యనారాయణ, సూర్యప్రభ దంపతుల హృదయ నైవేద్యం నేటి సమాజానికి, వైవాహిక, కుటుంబ ఉన్నత భావాల మణిదర్పణం.

**(హృదయ నైవేద్యం, ప్రతులకు: భోగరాజు పబ్లికేషన్స్, ప్రశాంతి నిలయం, 25-11-19, ఎన్.ఆర్.పేట, ఏలూరు-534006)**

**- ఎర్రమిల్లి**

రచయిత కొత్తపల్లి రామాంజనేయులు వృత్తి వ్యవసాయం. ప్రవృత్తి సాహిత్యాభిమానము. గానము, సాంప్రదాయాలు పల్లెపట్టులపై ప్రేమ. చదివినది ఆరవ తరగతి. అయినా ప్రపంచాన్ని చదివారు. కనుమరుగైపోతోన్న గ్రామీణ వాతావరణాన్ని కన్నులకు కట్టినట్లు, ఈ 34 కథల్లో చిత్రీకరించారు.

## శతాబ్దం కిందటి సాంప్రదాయ శైలి



ఏకలవ్యునివలె తనకు తాను సాహిత్య కేదారాల్లో స్వేచ్ఛగా విహరించారు. సొజ్జపంట సేద్యం (సొద్దకంకి) మోటారుబావిలోంచి నీళ్ల తోడటం (కపిల కథ) పొలాలకు పారించటం, అడవుల నుండి పశుగ్రాసాన్ని సేకరించటం (కొండగడ్డికథ) పండుగలు, సంబరాలు, సీమరైతు బ్రతుకులాంటి గ్రామజీవనాలే కాదు, కత్తివీరుడు సూరప్ప (1859) జ్ఞానదాత నారాయణస్వామి (1880-1920) తీగలవాగు తీరు, మొలకల పున్నమిని ఆనాడు వేడుకగా జరిపే తీరు లాంటి సాంప్రదాయాలు, ప్రముఖులు రామాంజనేయులు కలంలో ప్రాణం పోసుకున్నారు. ఇతివృత్తం ఏదైనా మూలాల్లోకి పోయి, శోధించి, రాయటం వల్ల ఈ కథలు ఆనాటి సంస్కృతికి ప్రతిబింబాలు. కథలన్నింటిలో వస్తువు, భావన, వివరణ, రసజ్ఞత, నిండుగా ఉంటూ, కనుమరుగైపోతోన్న నాటిపల్లె వాతావరణానికి ఇవి సాక్షాలుగా నిలుస్తాయి.

**(సొద్దకంకి, రచన: కొత్తపల్లి రామాంజనేయులు, వెల: రూ 200, ప్రతులకు: 1/1422-3-1, పూసల వీధి, యర్రముక్కపల్లె, కడప-516004)** **- కూర చిదంబరం**



# బతికి సాధిద్దాం!

**డాక్టర్ ఎన్.బి.సుధాకర్ రెడ్డి,**
సైకాలజిస్టు

**ఎన్టీఆర్** కుమార్తె ఉమామహేశ్వరి (57) ఆగస్టు ఒకటవ తేదీన ఆత్మహత్య చేసుకుంది. హైదరాబాద్‌లోని తమ నివాస గృహంలోనే సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని తనువు చాలించింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆమె ఆత్మహత్య వార్త చర్చనీయాంశం అయ్యింది. దీర్ఘకాలంగా డిప్రెషన్‌తో బాధపడుతున్న ఆమె ఒత్తిడి తట్టుకోలేక బలవన్మరణానికి గురైంది. గొప్ప రాజకీయ నాయకులు, సినీ రంగ ప్రముఖులు, వాణిజ్య, వ్యాపార వేత్తల మధ్య పెరిగిన నేపథ్యం ఉన్న ఆమె అకాల మరణం ఆశ్చర్యం కలిగిండి.

2019వ సంవత్సరం జులై 29న కేఫ్ కాఫీడే అధినేత వి.జి.సిద్దార్థ(59) బలవంతంగా ప్రాణం తీసుకున్నారు. ఆయన మంగళూరులోని నేత్రావతి నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నారు. దేశ విదేశాలలో కాఫీడేకి విశేష ప్రాచుర్యం కల్పించిన సృజనాత్మక వ్యాపార దిగ్గజం మరణం ప్రజల్లో దిగ్భ్రాంతిని కలిగించింది. తన తెలివితేటలు, నైపుణ్యం, వ్యాపార మెళకువలతో వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించుకున్న ఆయన ఒత్తిళ్లకు తట్టుకోలేక ప్రాణం తీసుకోవడం లక్షలాది మందిని కలచివేసింది. సర్వత్రా చర్చనీయాంశమైంది. సాధారణంగా మార్కులు తగ్గాయని, పరీక్ష తప్పానని విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోవడం జరుగుతోంది. అలాగే అప్పులు తీర్చలేక ఆత్మహత్య చేసుకునేవారు తారసపడుతుంటారు. అయితే అన్ని విధాలా సమాజంలో రాణిస్తున్న వ్యక్తుల్లో కొందరు కూడా ఆత్మహత్య చేసుకోవడం చాలా మందికి ఆశ్చర్యం కలిగిస్తోంది. పది మందికి ప్రాణం పోసే డాక్టర్లు, మానసిక రుగ్మతలకు చికిత్స చేసే సైకియాట్రిస్టులు బలవన్మరణానికి గురవుతున్న సంఘటనలు ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్నాయి. బాధల్లో ఉన్నవారికి ఆనందం పంచి, ఆలోచన పెంచే సినీ నటులు పలువురు ఆత్మహత్యలకు పాల్పడిన విషయం తెలుగు ప్రజలకు బాగా తెలుసు. మేధావులుగా చెప్పబడే ఐ.ఎ.ఎస్, ఐ.పి.ఎస్. అధికారులు కొందరు ఆత్మ హత్యలు చేసుకున్న సంఘటనలు మనకు తెలుసు. అంటే విద్యార్థులు, రైతులు, యువకులు, పేదవారు, సంపన్నులు, ఉన్నత వ్యక్తులు అన్న వ్యత్యాసం లేకుండా అన్ని వర్గాల ప్రజల్లో ఆత్మహత్యలు చోటు చేసుకుంటున్నాయి. ఇందుకు అనేక కారణాలు పైకి కనిపిస్తున్నప్పటికీ అసలు మూలాలను తెలుసుకోవలసిన అవసరం ఉంది. దీనికోసం సామాజికవేత్తలు, మానసిక నిపుణులు, వైద్యులు అనేక అధ్యయనాలు చేస్తున్నారు. పలు కోణాలలో పరిశీలను సాగిస్తున్నారు.

**ఆత్మహత్యలకు కారణాలు**

'నింద లేకుండా బొంది పోదు' అన్న మాట తెలుగులో చాలా ప్రాచుర్యం పొందింది. అంటే ప్రతి మరణానికి ఒక కారణం ఉంటుందని దీని భావన. అలాగే ప్రతి ఆత్మహత్య వెనుక ఒక బలమైన కారణం కనిపిస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా ఆత్మహత్యలపై అధ్యయనాలు, సర్వేలు చేసినవారు పలు కారణాలు కనుగొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఏడాది ఎనిమిది లక్షల మంది ఆత్మహత్యకు పాల్పడుతు న్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపింది. ఇందులో భారతదేశంలో చనిపోతున్నవారి సంఖ్య దాదాపు లక్షా నలభై వేల వరకు ఉంటోంది. 2019 లెక్కల ప్రకారం మన దేశంలో 1,39,123 మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఇందులో కుటుంబ సమస్యల వల్ల ఆత్మహత్య చేసుకున్నవారు అత్యధికంగా 32.4 శాతం ఉన్నారు. అనారోగ్య సమస్యల వల్ల బలవంతంగా తనువు చాలించినవారు 17.1 శాతం ఉన్నారు. వ్యసనాల వల్ల 5.6 శాతం, వివాహ సమస్య లవల్ల 5.5 శాతం, ప్రేమ వ్యవహారాల వల్ల 4.5 శాతం అప్పులు, దివాలాల వల్ల 4.2 శాతం మంది ఆత్మహత్యలు చేసుకున్నారు. ఏ కారణం తెలియకుండా ఆత్మహత్యలు చేసుకున్నవారు 10.3 శాతం కాగా, పరీక్షల్లో తప్పడం, నిరుద్యోగం, వృత్తిసమస్యలు, అనేక ఇతర కారణాల వల్ల 20.1 శాతం మంది చనిపోవడానికి ఆత్మహత్యను మార్గంగా ఎంచుకున్నట్టు సర్వేలు తెలుపుతున్నాయి. అయితే మహిళల కంటే పురుషులు, పెద్దవారికంటే యువకులు ఎక్కువగా ఆత్మహత్యలకు పాల్పడుతు న్నారని సర్వేలలో వెల్లడయింది. పురుషులు 70.2 శాతం, మహిళలు 29.8 శాతం మంది ఆత్మహత్యలకు పాల్పడిన వారిలో ఉన్నారు. అలాగే ఆత్మహత్యలకు పాల్పడుతున్నవారిలో 18.-30 ఏళ్ల వయస్సు వారు 35.1 శాతం, 30-45 మధ్య వయసువారు 31.8 శాతం ఉన్నారు. అంటే 45 ఏళ్లలోపువారు 66.9 కాగా మిగిలిన వయస్సు వారు 33.1 శాతం

ఉన్నారని సర్వే రిపోర్టులు తెలుపుతున్నాయి. ఈ సర్వేలను విశ్లేషిస్తే కుటుంబ సమస్యలు ఎక్కువ మందిని పొట్టన పెట్టుకుంటున్నాయని తెలుస్తోంది. అంటే కుటుంబ సంబంధాలు తరిగిపోవడం, స్వార్థం పెరిగిపోవడం వల్ల పలు సమస్యలు తలెత్తి ఆత్మహత్యలకు దారి తీస్తున్నాయని భావించాల్సి వస్తోంది. కాగా యువకులే ఎక్కువగా మరణించడానికి అనుభవ రాహిత్యం, అవగాహనా లోపం, ఉద్వేగ నియంత్రణ కొరవడడం లాంటివి కారణాలుగా చెప్పవచ్చు. అయితే సమస్యలే ఆత్మహత్యకు కారణం అనుకుంటే– అలాంటి సమస్యలు ఉన్నవారు అందరూ చనిపోవాలి కదా? అనే ప్రశ్న ఉదయిస్తుంది. దీనిని విశ్లేషిస్తే సమస్యకంటే సమస్యను ఎదుర్కోలేని మానసిక దుర్బలత్వమే ఆత్మహత్యకు ప్రేరకమని మానసిక నిపుణులు అంటున్నారు. సమస్యలు ఎదురైనపుడు పరిష్కారం వైపు ఆలోచించలేనివారు, నిరాశ, నిస్పృహ, ఒత్తిడికి గురై చావే శరణ్యం అనే భావనకు వస్తుంటారు. ఆఖరికి ఆత్మహత్యనే మార్గంగా ఎంచుకుని, తనను నమ్ముకున్నవారు,ప్రేమించే వారికి శోకం మిగిల్చి వెళ్లిపోతుంటారు.

### డిప్రెషనే మూలం

ఆత్మహత్యలకు అనేక కారణాలు ఉన్నట్టు సర్వేల ద్వారా మనం తెలుసుకున్నాం. ఎవరైనా ఆత్మహత్య చేసుకున్నప్పుడు కారణాలు అన్వేషించి బాధ్యులయిన వారిని నిందిస్తుంటాం. ఒక యువకుడు లేక ఒక యువతి ప్రేమ విఫలమై ఆత్మహత్యకు పాల్పడితే ఎదుటి వ్యక్తిని మోసకారిగా భావించి విమర్శలు చేస్తాం. ఒక మహిళ పిల్లలకు పురుగుల మందిచ్చి, తాను తాగి చనిపోతే భర్త, అత్త–మామలను ఆడిపోసుకుంటాం. తల్లిదండ్రులు మందలించారని పరీక్ష తప్పిన విద్యార్థి ఆత్మహత్య చేసుకుంటే కన్నవారిని రాక్షసులుగా చిత్రీకరిస్తాం. అప్పు ఇచ్చిన వారు వేధించారని అప్పు చేసిన వ్యక్తి లేదా కుటుంబం ఆత్మహత్యకు పాల్పడితే అప్పులు ఇచ్చినవారిని కిరాతకులంటూ విమర్శిస్తాం. ఇలాగే ప్రతి సంఘటనలోను ఏదో ఒక కారణం వెలికితీసి అందుకు బాధ్యులయినవారిని పట్టుకుని శిక్షించాలని కోరుకుంటాం. పోలీసులు కూడా కొన్ని సందర్భాలలో కారణంగా భావించిన వారిపై కేసులు పెడుతుంటారు. కొన్ని సంస్థలవారు రోడ్లపై ప్రదర్శనలు, నినాదాలు చేస్తుంటారు. అయితే ఆత్మహత్యలకు కారణాలు, నివారణ మార్గాలను గురించి ఆలోచించేవారు తక్కువేనని చెప్పక తప్పదు. జీవితం అంటే సమస్యల వలయం. పురిటి బిడ్డ నుంచి పండు ముసలివారి వరకు నిరంతరం ఏదో ఒక సమస్య ఎదురవుతూనే ఉంటుంది. ప్రతి వ్యక్తి ప్రతికూల పరిస్థితులను ప్రతిఘటిస్తూ సమస్యలను ఎదుర్కొంటూ ముందుకు వెళుతుంటారు. ఓటమిని గెలుపుకు పునాదిగా మార్చుకుని సాగిపోతుంటారు. సమస్యలను ఎదుర్కొని, సవాలుగా స్వీకరించి విజయం వైపు పయనిస్తుంటారు. జీవన గమనంలో ఇలాంటి పోరాటాలు సహజమని గుర్తించి తట్టుకుని బతుకుతుంటారు. కొందరు అవసరమైన సామర్థ్యాలు, నైపుణ్యాలను పెంపొందించుకుని ఒత్తిళ్లను వరాలుగా మార్చుకుంటారు.

అయితే సమాజంలో అతి తక్కువ మంది



మానసిక దుర్బలత్వం వల్ల లేదా సున్నితమైన మనసత్వం వల్ల సమస్యలు ఎదురైనపుడు అతిగా స్పందించి ఒత్తిడికి గురవుతుంటారు. ఇదంతా తమ కర్మని భావిస్తుంటారు. సెంటిమెంట్లకు లోనై ఆత్మన్యూనతా భావం పెంపొందించుకుంటారు. సమస్యను ఎదుర్కోవడం లేదా బయట పడటానికి ప్రయత్నించరు. ఎవరికీ చెప్పుకోలేక, చెప్పకుండా మనసులో దాచుకుని కుమిలిపోతుంటారు. దీర్ఘకాలం ఇలాంటి ఒత్తిళ్లను భరిస్తూ వచ్చేవారు క్రమంగా డిప్రెషన్‌కు గురౌతారు. డిప్రెషన్ తీవ్ర రూపం దాల్చినపుడు మరొక మార్గం లేదన్న నిరాశ నిస్పృహకు లోనై ఆత్మహత్యకు పాల్పడుతుంటారు.

ఆత్మహత్యకు పాల్పడినవారిలో మనం వెదికే కారణం ఒక ప్రేరకం మాత్రమే అన్న విషయం గుర్తించం. చాలా కాలంగా గూడు కట్టుకున్న ఒత్తిల్లు డిప్రెషన్ ఆత్మహత్యలకు మూలమని గుర్తిస్తే పరిష్కార మార్గాలు స్ఫురిస్తాయి. సమాజం, తల్లిదండ్రులు, స్నేహితులు, సన్నిహితులు ఆత్మహత్యలకు పాల్పడే వారిని ముందుగానే గుర్తించవచ్చని సైకాలజిస్టులు అంటున్నారు. ఆత్మహత్యలకు పాల్పడే వారిలో 90 శాతం మందిలో డిప్రెషన్ లేదా ఇతర తీవ్రమైన మానసిక సమస్యలు ఉంటాయని పలు అధ్యయనాలలో రుజువైంది. ఆత్మహత్యలకు పాల్పడేవారిలో కొన్ని లక్షణాలను ముందుగానే గుర్తించవచ్చు. సాధారణంగా ఇలాంటివారు నిరాశ, నిస్పృహకు గురవుతుంటారు. నెమ్మది, నెమ్మదిగా ఇతరులతో కలవడం, మాట్లాడటం తగ్గించివేస్తారు. వీలైనంతవరకు ఒంటరిగా ఉండటానికి ప్రయత్నిస్తుంటారు. అప్పుడప్పుడు వేదాంత ధోరణిలో మాట్లాడుతుంటారు. “నా జీవితం వృధా, దీనికంటే చావే శరణ్యం, ఎప్పుడో ఒకప్పుడు చస్తాను” లాంటి మాటలు అంటుంటారు. ఆత్మహత్య చేసుకునే విధానాలు, పద్ధతులను గురించి మాట్లాడుతుంటారు. ఆత్మహత్యకు అవసరమైన తాడు, నిద్రమాత్రలు, ఇతర ఆయుధాలను సేకరిస్తుంటారు. తాగుడు అలవాటు ఉన్నవారు అతిగా తాగుతుంటారు. అతివేగంగా బండి లేదా కారు నడపడం చేస్తుంటారు. అంటే వారి మాటల్లోను, చేతల్లోను అసహజ ప్రవర్తన కనిపిస్తుంటుంది. అలాంటి పరిస్థితి గుర్తించిన కుటుంబ సభ్యులు లేదా సన్నిహితులు వారికి నిపుణుల ద్వారా కౌన్సిలింగ్ లేదా చికిత్స చేయించడం మంచిది. సహజంగా ఒత్తిడి, డిప్రెషన్, ఆత్మహత్య చేసుకోవాలన్న భావాలు వున్నవారిలో దృక్పథ లోపం, రసాయనాల అసమతుల్యత ఉంటుంది. వాటిని సరిదిద్దితే మామూలు మనిషిలా మారిపోతారు.

### ఆత్మవిశ్వాసమే ఔషధం

చాలా సమస్యలకు ఆత్మవిశ్వాసమే ఆయుధం. అలాగే ఔషధం కూడా. మనిషిలో ఆత్మవిశ్వాసం క్షీణిస్తే ఆత్మన్యూనత, భయం, ఆందోళన, ఒత్తిడి ప్రవేశిస్తాయి. అవి డిప్రెషన్‌కు తద్వారా ఆత్మహత్యకు దారి తీస్తాయి. కాబట్టి తీవ్రమైన మానసిక ఒత్తిల్లు, డిప్రెషన్‌కు గురవుతున్న వారిని గుర్తించి ఆదరించి, అవగామన కలిగించి, ఆత్మవిశ్వాసం పెంపొందించాలి. సానుకూల ఆలోచనలు కలిగించి, పరిష్కార మార్గాలు సూచించగలిగితే తట్టుకునే శక్తి పెంపొందుతుంది. బాధతో ఉన్నవారిని విమర్శించడం మాని, ఆదరించడం నేర్చుకోవాలి.

సమస్యలు ఎదురైనప్పుడు ప్రత్యామ్నాయ మార్గాలు వెదకడం నేర్పించాలి. సామాజిక స్పృహ పెంపొందించాలి. వాస్తవిక దృక్పథం అలవర్చాలి. అలాగే 'నీకు నేనున్నాను' అన్న భరోసా కల్పించాలి. కాగా ఎవరికి వారు తమ మానసిక స్థితిని గుర్తించి బయట పడటానికి ప్రయత్నించడం ఉత్తమం.

కథ

# దుర్గాదేవి సలహా

**చాలా** కాలం క్రితం గంగన్న అనే వ్యక్తి అడవుల్లో దారి కాచి వచ్చే పోయేవారిని బెదిరించి దోచుకునేవాడు. అలా ఒకసారి కందగిరి అడవిలోకి వెళ్లి అక్కడ బాట దగ్గర కాపుకాచి వచ్చే పోయేవారిని దోచుకోవాలని అక్కడికి వెళ్లాడు. అలా కొంత దూరం వెళ్లేసరికి వాడికి దూరంగా చెట్ల మధ్యన గుడి కనిపించింది. దానిని చూసి వాడు ఆశ్చర్యపోయి ఆ గుడి దగ్గరకు వెళ్లి లోపలికి వెళ్లాడు. అది పురాతన గుడి, అందులో ఓ దుర్గాదేవి విగ్రహం శిథిల రూపంలో ఉంది.

ఆ విగ్రహం చూస్తూనే వాడిలో ఒక విధమైన భక్తి పుట్టుకొచ్చింది. వాడు కళ్లు మూసుకుని

"అమ్మా దుర్గామాతా! ఈ రోజు నాకు ధనం, బంగారం బాగా దొరికేటట్టు ఆశీర్వదించు" అని ప్రార్థించాడు.

వాడి ప్రార్థన పూర్తవగానే ఆ విగ్రహం నుండి మెరుపులు వెలువడ్డాయి.



"గంగన్నా! జనాల్ని దోచుకోవడం మహా పాపం. వాళ్లు ఎంతో కష్టపడి సంపాదించుకున్న ధనం, బంగారం దోచుకోవడం చాలా తప్పు కదా, ఇక నీవు మారు" అని విగ్రహంలో నుండి వినబడింది.

వాడు ఆశ్చర్యపోయి "తల్లీ నాకు చదువు లేదు, మరే వృత్తి చేతకాదు. మరి నేనేం చేయాలి?" అని తన బలహీనత చెప్పాడు.

"నేను చెప్పినట్టు చెయ్యి. నీవు బాట దగ్గరకు వెళ్లు. బండిలో కనకయ్య అనేవాడు వస్తున్నాడు. నీవు వాడిని దోపిడీ చెయ్యకుండా వాడిని అర్థించి వాడితో వెళ్లు. నీ కష్టాలకు ఒక మంచి దారి కనబడి నీ జీవితానికి ఒక మంచి ఉపాధి లభిస్తుంది" చెప్పింది దుర్గాదేవి.

ఆమె మాటలకు వాడు ఆశ్చర్యపోయి దేవికి దండం పెట్టి, బాట దగ్గరకు వెళ్లాడు.

దేవి చెప్పినట్లుగానే ఒక బండిలో కనకయ్య అనేవాడు బండిలో ధాన్యంబస్తాలు వేసుకుని ఆ దారిలో వచ్చాడు. గంగన్న బండి దగ్గరకు వెళ్లి తను కూడా అతను వెళ్లే వైపే తాను వెళుతున్నట్టు తనను బండి ఎక్కించుకోమని అడిగాడు.

కనకయ్య గంగన్నను బండి ఎక్కించుకుని వెళ్లసాగాడు. అలా కొంత దూరం వెళ్లేసరికి పెద్ద వాన మొదలైంది. బండి కొద్ది దూరం పోగానే బండి చక్రం బురదలో దిగబడిపోయింది.

బండి తోలేవాడు ఎంత ప్రయత్నించినా బండి బురదలో నుండి బయటకు తీయలేకపోయాడు.

గంగన్న తన శక్తినంతా ఉపయోగించి ఒక్కడే బండిని బురద నుండి బయటకు తీశాడు.

కనకయ్య, బండి తోలేవాడు గంగన్న బలాన్ని ఎంతో పొగిడాడు. "నీవేం చేస్తుంటావు? నీ పేరేమిటి?" అడిగాడు కనకయ్య.

"అయ్యా, నా పేరు గంగన్న, ప్రస్తుతం ఏవో చిన్న పనులు చేసుకుని బతుకుతున్నాను. పని వెతుక్కుంటూ మీతో పాటు వస్తున్నాను" చెప్పాడు, గంగయ్య. "ఒక పని చేయి, నీకు బలం బాగుంది. నాకు ధాన్యం వ్యాపారం ఉంది. నీకు బలం బాగుంది. రోజూ కొన్ని బస్తాలు బండ్లలో వేయడం, పొలం నుండి వచ్చిన బస్తాలు దింపడమే నీ పని. ఈ పని చేస్తే నీకు నెలకు వెయ్యి రూపాయలు ఇస్తాను.

అలా గంగయ్య కనకయ్య దగ్గర పనికి చేరాడు. కేవలం బస్తాలు మొయ్యడమే కాకుండా కనకయ్యకు అనేక ఇతర పనులు చేసిపెట్టే వాడు గంగయ్య. వాడి మంచితనానికి మెచ్చి మరికొంత జీతం పెంచాడు కనకయ్య.

ఆ విధంగా గౌరవప్రదంగా సంపాదించడం వల్ల గంగన్నకు ఎంతో తృప్తి లభించింది. వాడు అడవికి వెళ్లి దుర్గ గుడికి వెళ్లి దేవిని ప్రార్థించి "కనకయ్య దగ్గర పనిలో చేరడం వల్ల పని విలువ తెలిసింది. ఇకమీదట దొంగతనం మాని కష్టపడి సంపాదిస్తాను" అని దండం పెట్టాడు. దుర్గాదేవి తన ఆశీర్వాదాలు తెలిపి, గంగన్న చేసే మంచి పనులకి ఎప్పుడూ తన సహాయం ఉంటుందని తెలిపింది.

ఆ గుడిని గురించి గంగన్న కనకయ్యకు చెప్పాడు. కనకయ్య గంగన్నతో కలిసి ఆ గుడిని దర్శించాడు. ఆ గుడి కనకయ్యకు ఎంతో నచ్చింది. తన శాయశక్తులా డబ్బు వెచ్చించి గుడిని బాగు చేయించాడు. గంగన్న కూడా సంతోషించాడు.

**- కంచనపల్లి వేంకట కృష్ణారావు**


## బాలగేయం

### బుజ్జిగాడు



మా ఇంటిపక్క
బుజ్జిగాడు
మా ఇంటికొచ్చాడు
ప్లాస్టిక్ కారు
చేతపట్టుకొచ్చాడు
మీట నొక్కితే
నడుస్తుంది
స్పీడ్ పెంచితే
పరుగెడుతుంది
ఇద్దరం గంటసేపు
ఎంచక్కా ఆడుకున్నాం
ఇంతలో వచ్చింది మా
అమ్మ
మిఠాయి తెచ్చింది
చెరి సగం ఇచ్చింది.

**- వైదా ఈశ్వరరావు,**
విశాఖపట్నం



## హలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**

**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**

## గిరీష్ అంకుల్ సమాధానాలు

**- ఎస్.భాస్కర్,** కనిగిరి

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. విమానపు ప్రొపెల్లర్‌లు ఏ విధంగా పనిచేస్తాయి?



**జవాబు: భాస్కర్!** విమానం గాలిలో ముందుకు దూసుకు పోవడానికి ప్రొపెల్లర్స్ సహకరిస్తాయి. అంటే ఈ ప్రొపెల్లర్‌లకు ఉండే బ్లేడ్‌లు ఎదురుగా వస్తున్న గాలిని చీల్చుకుంటూ ఎంతో శక్తివంతమైన వేగంతో దానిని వెనక్కి నెట్టి వేస్తాయి. అప్పుడాగాలి ప్రొపెల్లర్స్‌ను ముందు వైపుకి నెడుతుంది. న్యూటన్ గతి సూత్రం యాక్షన్ అండ్ రియాక్షన్(చర్య-ప్రతిచర్య) సిద్ధాంతం ప్రకారం విమానం ముందు వైపుకు చూసుకుని వెళుతుంది. ప్రతి ఒక్క చర్యకు సమాన ప్రతిపత్తిలో ప్రతిచర్య అనేది ఉంటుందన్న సిద్ధాంతరీత్యా ఈ రెండు చర్యలూ వ్యతిరేకంగా కూడా ఉంటాయి.

**- పి.ఆశ్విని,** కాకినాడ

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. సాలీడు దారంతో గూడు దేనికోసం కడుతుంది?



**జవాబు: ఆశ్విని!** సాలీడు దారం కేవలం గూడు అల్లుకోవడానికే కాదు.. ఇంకా అనేక రకాలుగా ఉపయోగపడుతుంది. దారంతో ఒక చిన్న గుల్ల మాదిరిగా తయారుచేసి అందులో గుడ్లు పెడుతుంది. పిల్ల సాలీడుకు ఒక పారాచూట్‌ను తయారుచేసి ఇస్తే అది గాలిలో ఎగురుతూ కొత్త ప్రదేశాలకు వెళ్లినట్లుగా ఈ చిన్న గుల్ల ఉపయోగపడుతుంది. ఇవి ఈ దారాలను మీటడం ద్వారా ఒకదానితో ఒకటి సంభాషణలు కూడా జరుపుకుంటాయి. అంతేకాదు, ఆహార సంపాదనకు కూడా ఉపయోగపడతాయి.



# ఆరోగ్యసిరి లీచీ పండు

**ఎరుపూ,** గులాబీ రంగుల్లో తెల్లని గుజ్జుతో నోరూరించే లీచీ పండ్లు ఇప్పుడు మన దగ్గరా పండుతున్నాయి. రెండు సంవత్సరాల క్రితం దక్షిణ చైనా అడవుల్లో పుట్టిందీ చెట్టు. దాని పండ్లను తిన్న పక్షుల వల్ల పండ్ల రుచి ఆ చుట్టుపక్కల వారికి తెలిసింది. చైనాను పాలించిన తంగ్ వంశీకుడైన క్స్ యాన్ జాంగ్ తన ముద్దుల భార్య యాంగ్‌కి ఇష్టమైన లీచీ పండ్ల కోసం రెండు వేల కి.మీ. దూరంలో ఉన్న గుయాంగ్ డాంగ్‌కి గుర్రాల మీద సైన్యాన్ని పంపించి తెప్పించేవాడట. ఇప్పుడు ఆ సమస్య లేదు. ప్రపంచ వ్యాప్తంగా దీన్ని పండిస్తున్నారు. లీచీని అధికంగా పండించే దేశం నేటికీ చైనా అయితే ఆ తరువాతి స్థానం భారత్‌దే. నిన్న మొన్నటివరకు ఉత్తరాదిన బీహార్‌లో లీచీ పంటను ఎక్కువగా పండించేవారు. ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లోనూ పండుతోంది.

## స్ట్రాబెర్రీల్లాగే..

ఈ పండ్లు స్ట్రాబెర్రీలానే అనిపిస్తాయి. మృదువైన ఈ పండ్ల గుజ్జుని నేరుగా తినడంతో పాటు షర్బత్‌లు, జ్యూస్‌లు, ఐస్‌క్రీమ్స్ తయారీలో వాడతారు. ఎరుపు రంగులో ఉండే షాహీ, ఎరుపూ ఆకుపచ్చా కలగలిసిన రంగులోని బొంబై, గులాబీ రంగులో ఉండే గులాబీ, డెహ్రా రోజ్; పెద్ద సైజులో ఉండే లేట్ లార్జ్ రెడ్, హృదయాకారంలోని క్రైమానా.. ఇలా లీచీలో పండ్లలో ఎన్నో రకాలున్నాయి. అయితే లోంగన్, రాంబుతాన్ పండ్లు కూడా తెల్లని గుజ్జుతో దాదాపు లీచీ పండ్ల రుచితోనే ఉంటాయి. రాంబుతాన్ పండ్లకు పై భాగంలో జుట్టులా ఉంటే, లోంగన్ గోధుమ రంగులో సపోటాని తలపిస్తుంది. కానీ మూడింటికీ గుజ్జు తెల్లగా, మృదువుగా ఉంటుంది. చూడ్డానికి వేర్వేరుగా ఉన్నా మూడూ తియ్యగా ఉంటాయి. మూడింటిలోనూ పోషకాలు సమానంగా ఉంటాయి.

## ఎందుకు మంచిది?

ఎక్కువ పీచుతో జ్యూసీగా ఉండే ఈ పండ్లలో క్యాలరీలు తక్కువ. వంద గ్రా.లీచీ పండ్లలో 75 మి.గ్రా. సి-విటమిన్ ఉంటుంది. బి2, పొటాషియం, కాపర్ మొదలైన పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. ద్రాక్షతో పోలిస్తే వీటిల్లో పాలీఫినాల్స్ శాతమూ అధికమే. అందుకే ఇది కేన్సర్లను ముఖ్యంగా రొమ్ము కేన్సర్లని అడ్డుకుంటుందని అంటారు. వైరస్ వంటి సూక్ష్మజీవుల వల్ల కలిగే వ్యాధుల్ని నిరోధించే గుణం ఈ పండ్లలోని యాంటీ ఆక్సిడెంట్లకు ఉంది. ఇందులోని ప్రొఆంథోసైనిడిన్స్ హృద్రోగ నివారణకు తోడ్పడుతున్నట్లు గుర్తించారు. ఈ గింజల నుంచి తీసిన ఎక్స్‌ట్రాక్ట్ ఇన్సులిన్ నిరోధాన్ని అడ్డుకుంటుందనీ, ఒలిగోనాల్ అనే పాలీఫినాల్ మధుమేహంతో వచ్చే రక్తప్రసరణ లోపాల్ని నివారిస్తుందనీ పరిశోధనలు




చెబుతున్నాయి. ఇన్‌ఫ్లమేషన్, ఆక్సీకరణ ఒత్తిడి, ఊబకాయం వంటి ఎన్నో వ్యాధుల నివారణకు ఈ ఒలిగోనాల్ తోడ్పడుతుంది. పొట్ట దగ్గర పేరుకున్న కొవ్వునీ, అలసటను సైతం తగ్గిస్తుందట. కాలేయ కణాలు కోలుకునేందుకు, జ్ఞాపకశక్తి పెరగడానికి, ఒత్తిడి, ఆందోళన, బీపీ, షుగర్ తగ్గేందుకు ఈ పండ్లు ఎంతగానో తోడ్పడతాయి. మృదువైన లీచీపండు జీర్ణశక్తికి ఉపకరిస్తుంది. చర్మం ముడతలు పడకుండా కాపాడుతుంది. ఈ పండ్లలో పీచు పదార్థం ఎక్కువ కనుక పొట్ట నిండినట్లుగా అయి ఆకలిని తగ్గిస్తుంది, తద్వారా ఊబకాయం తగ్గుతుంది. శ్వాసకోశ సమస్య ఉన్నవాళ్లకి సైతం లీచీ ఉపశమనం కలిగిస్తుంది.

లీచీ తోటల్ని పెంచే ప్రాంతాల్లోని పిల్లలు ఖాళీ కడుపుతో పచ్చి లీచీ పండ్లను తినడం వల్ల వాటిలోని హైపోగ్లైసిన్ అనే అమైనో ఆమ్లం వల్ల గ్లూకోజ్ శాతం పడిపోయి ఎన్‌సెఫలోపతీ వ్యాధికి గురైనట్లు గుర్తించారు. అందువల్ల పిల్లలు రాత్రిపూట భోజనం మానకుండా చూడటంతో పాటు పండిన వాటినే మితంగా తినేలా చేయగా కేసులు తగ్గాయి. దీంతో ఆకలి ఎక్కువగా వున్నప్పుడు పచ్చి లీచీల్ని తినడం వల్ల ఇలా జరిగిందని భావిస్తున్నారు. వేల సంవత్సరాల నుండి ఎంతో మంది ఇష్టంగా తింటున్న ఆరోగ్యకరమైన పండు 'లీచీ'.

## ప్రాచీన ప్రపంచ వింత

(7వ పేజీ తరువాయి)


దీని మధ్య భాగంలో ఛియోప్స్ సమాధి ఉంటుంది. ఈ పిరమిడ్ నిర్మాణానికి సుమారు లక్ష మంది బానిసలు పని చేసి ఉంటారని అంచనా. రాజుల శవాన్ని భద్రపరచిన శవపేటికను కాఫిర్ లేక సర్కోపంగస్ అని అంటారు. ఇది గ్రానైట్ గదిలో పశ్చిమాన ఉంది. ఉత్తర దిశ నుంచి పిరమిడ్ లోపలికి ప్రవేశ మార్గం ఉంది. గిజా పిరమిడ్ దాదాపు 12 ఎకరాల విస్తీర్ణంలో 147 మీటర్ల పైబడి ఎత్తులో గంభీరంగా కనిపిస్తుంది. ది గ్రేట్ పిరమిడ్ ఆఫ్ గిజా అత్యంత ప్రాచీనమైన, అతి పెద్ద పిరమిడ్. గిజా పిరమిడ్ వయసు



4,500 సంవత్సరాలుగా చెబుతున్నారు. మరి స్ఫింక్స్‌ని అంతకంటే ముందే నిర్మించారా? అనే విషయం కూడా తేలలేదు. ఈ స్ఫింక్స్ అనేక వేల ఏళ్ల నుండి ఇక్కడ ఉన్నప్పటికీ అది ఎందుకు ఉంది? అనే విషయం చాలా మందికి తెలియదు. భారీ పిరమిడ్లను నిర్మించిన పిదప పిరమిడ్లకు కాపలాగా ఈ స్ఫింక్స్‌ను నిర్మించి ఉండవచ్చని కొందరు అభిప్రాయపడుతుంటారు. కొందరు పరిశోధకులు స్ఫింక్స్ అనేది మహిళ ముఖం కాదు, ఫరో రాజు ఖాఫ్రే ముఖారవిందమని పలు ఆధారాలతో చెబుతున్నారు. స్ఫింక్స్ ఆకారం ముందునుండి వెనుకకు 241 అడుగుల పొడవు, కింద నుండి పైకి 66.33 అడుగుల ఎత్తు, ముందు అడ్డంగా 63 అడుగుల వెడల్పును కలిగి ఉంటుంది. ఈ ఆకారాన్ని గట్టి సున్నపురాయితో నిర్మించినట్లు తెలుస్తుంది.

రెండవ అతి పెద్ద పిరమిడ్ "ఛెఫ్‌రెన్ పిరమిడ్", ఛియోప్స్ పిరమిడ్‌కు నైరుతి మూలగా ఉంది. ఇది 460 అడుగులు (140 మీటర్లు) ఎత్తు, 709 అడుగులు (216 మీటర్లు) చదరం కలిగి వున్నాయి. ఛియోప్స్ పిరమిడ్ వలె కాకుండా పూకి వెళ్లేకొద్దీ మరింత సన్నగా, కోలగా సూదిగా ఉంటుంది. "ఛియోప్స్" పిరమిడ్స్ పిరమిడ్ వలె పైభాగం సున్నపు పూత లేకుండా "ఛెఫ్‌రెన్" పిరమిడ్ సున్నపు ఫలకాలను ఎదురెదురుగా అతికింపబడి, సున్నపు పూత అవసరం లేకుండానే రూపొంది ఉంది. ఇలా ఫలకాలను అతకడంలో మంచి నేర్పరితనం వ్యక్తమవుతుంది.

"ఛియోప్స్" పిరమిడ్ చుట్టూ ఎత్తు తక్కువగా ఉండే 118కి పైగా చిన్న చిన్న సమాధులున్నాయి. ఈ సమాధులు బల్లపరుపుగా ఉన్నాయి. వీటిని మస్తబాస్ అంటారు. మూడు చిన్న పిరమిడ్స్, ఛియోప్స్ కుటుంబీకులు, అతనికి సంబంధించిన ఉన్నతోద్యోగుల సమాధులు ఉన్నట్లు గుర్తింపబడ్డాయి. పిరమిడ్ దక్షిణ గోడ వద్ద ఒకే నేలమాళిగ (అండర్‌గ్రౌండ్) ఉంది. 1954లో ఈ విషయం బయటకు వచ్చింది. ఇందులో చియోప్స్ 'ఫ్యూనరల్ షిప్' ఉంది. 4600ల సంవత్సరాలకు పూర్వం పనాడో అక్కడ ఉంచిన పడవ ఎవ్వరూ ముట్టనైనా ముట్టకుండా ఈనాటికీ భద్రంగా ఎలా ఉండాలో అలానే ఉంది. చనిపోయిన రాజుగారు స్వర్గానికి వెళ్లాలంటే తగిన వాహనం ఉండాలని ఈజిప్టువారు విశ్వసించేవారు. అందువల్ల రాజుగారి స్వర్గారోహణ ప్రయాణం నిమిత్తం ఒక పడవ అందులో ఆహార పదార్థాలు, దుస్తులు, ఆయన



సేవ సహాయాల కోసం చనిపోయిన సమాధి అయిన సేవకుల శవాలను ఆ పడవలో ఉంచేవారు. అటువంటి పడవ ఒకటి పిరమిడ్ నేల మాళిగలో భద్రంగా ఉంది.

తాజాగా ఈ గిజా పిరమిడ్‌పై కొందరు ఔత్సాహిక పరిశోధకులు పరిశోధనలు చేశారు. అందులో పలు ఆసక్తికర విషయాలు వెలుగు చూసాయి. పిరమిడ్ లోని గ్రాండ్ గాలరీ నుంచి 30 మీటర్ల లోతు వరకు సైంటిస్టులు 'కాస్మిక్ రే ఇమేజింగ్' టెక్నాలజీ సాయంతో సైంటిస్టులు పరిశోధనలు చేశారు. గ్రేట్ పిరమిడ్‌లో లోపల రహస్యంగా ఉన్న సొరంగాలు, వంకీ ఆకారంలో ఉన్న నిర్మాణాలను, ఇతర కీలక అంశాలను సైంటిస్టులు దీని ద్వారా గుర్తించారు. సైంటిస్టులు కాస్మిక్ టెక్నాలజీతో చేసిన పరిశోధన వల్ల పిరమిడ్ నిర్మాణం గురించి తెలుసుకోవడంలో పురోగతి సాధించారు.

అప్పట్లోనే ఆధునిక భౌతిక శాస్త్రాన్ని నిర్మాణ శాస్త్రంలో వినియోగించడంపై సైంటిస్టులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. గిజా పిరమిడ్ లోపల ఇప్పుడు అనుకుంటున్నట్లుగా కాకుండా మరో గ్రాండ్ గాలరీతో పాటు, విభిన్న ఆకృతులతో కూడిన నిర్మాణాలు ఉన్నట్లు తెలిసింది. ఈజిప్టు పిరిమిడ్లను తిలకించాలంటే గుర్రపు బగ్గీలు, ఒంటెలు అందుబాట్లో ఉంటాయి.



ఒంటెలపై వెళితే చాలా సమయం పడుతుం ది. ఇక్కడి వింతలు, విశేషాల ను వివరించడానికి గైడ్లు అందు బాట్లో ఉంటారు. ❑

కథ

# బోరుసు

గన్నవరపు నరసింహమూర్తి

ఆ రోజు నేను ఎయిర్‌పోర్ట్‌కి వెళుతున్న సమయంలో సుధాకర్ ఫోన్ చేసి తను వస్తున్నట్లు చెప్పాడు.

సుధాకర్ నా స్నేహితుడు. ఇద్దరం అమెరికాకి ఒకేసారి వచ్చి ఎమ్మెస్ చేసి, ఉద్యోగాల్లో చేరాం.

అమెరికా వచ్చిన తరువాతే సుధాకర్ పరిచయం. అతనిది తెలంగాణ.. వరంగల్ దగ్గర ఊరు వాళ్లది.

మాది ఉత్తరాంధ్ర.

ఆఫీసు పని నిమిత్తం నేను ఆస్ట్రేలియా వెళ్లవలసి వచ్చింది. చాలా రోజుల నుంచీ నేను హైదరాబాద్‌లో ఒక ఫ్లాట్ కొందామని అనుకుంటున్నాను. సంవత్సరం క్రితం సుధాకర్ హైదరాబాద్‌లో ఒక ఫ్లాట్ కొన్నాడు. అందులో అతని తల్లిదండ్రులుంటు న్నారు. వాడు ఇల్లు కొన్న దగ్గర్నుంచీ నన్ను కూడా హైదరాబాద్‌లో ఒక ఫ్లాట్ తీసుకోమని తెగ పోరు పెడుతుండటం, దానికి నా శ్రీమతి లయ కూడా వంత పాడటంతో ఆస్ట్రేలియా నుంచి తిరిగి వస్తున్నప్పుడు హైదరాబాద్ వెళ్లాలని టికెట్స్ రిజర్వ్ చేసాను.

ఫోన్ వచ్చిన అరగంట తరువాత సుధాకర్ వచ్చాడు. లయ తల్లిదండ్రులు అంటే మా మామగారి కుటుంబం హైదరాబాద్‌లో ఉంటోంది. మా బావమ రుదులిద్దరూ అక్కడే పని చేస్తున్నారు.

అందుకే అక్కడ యిల్లు కొనాలని లయ కోరిక.

అరగంట తరువాత సుధాకర్ వచ్చాడు. వస్తూనే "ఎన్నింటికి నీ ఫ్లైట్" అని అడిగాడు.

"ఇంకో మూడు గంటల్లో నేను ఎయిర్‌పోర్టుకి చేరుకోవాలి. నీ కోసమే చూస్తున్నాను"

"ఏం లేదు ఆదిత్యా.. నువ్వు తిరుగు ప్రయాణంలో హైదరాబాద్ వెళ్తున్నావ్ కదా.. నువ్వు శ్రమ అనుకోకుండా ఒకసారి మా ఫ్లాట్‌కి వెళ్లి మా అమ్మనీ, నాన్ననీ కలిసిరా. నేను వెళ్లలేదని వాళ్లు చాలా బాధపడుతున్నారు. మొన్న అయితే ఉద్రేకపడి మా ఊరు వెళ్లిపోతానన్నారు. నువ్వెళ్లి వాళ్లని కొద్దిగా ఓదారిస్తే పరిస్థితి చక్కబడొచ్చు. నేను ఇంకో సంవత్సరందాకా వెళ్లే పరిస్థితి కనిపించటం లేదు" అన్నాడు సుధాకర్.

"తప్పకుండా వెళతాను. ఈ విషయం చెప్పటానికి నువ్వు రావాలా? ఫోన్ చేస్తే సరిపోయేది కదా?" అన్నాను వాడితో.

"లేదు.. ఫోన్‌లో చెప్పడం మంచిది కాదు. అందుకే వచ్చాను. అమెరికాలో పని చేస్తున్న మన తరం కొడుకులందరికీ తల్లిదండ్రులతో ఈ సమస్య ఉంది. నువ్వు అర్థం చేసుకుంటావని నాకు తెలుసు" అన్నాడు కారు స్టార్ట్ చేస్తూ.

ఆ తరువాత నేను విమానాశ్రయానికి బయలుదేరాను.

ఆ సమయంలో నాకెందుకో మా ఊళ్లో ఒంటరిగా కాలం గడుపుతున్న మా అమ్మ గుర్తుకొచ్చి కళ్లనీళ్లు చెమ్మగిల్లాయి.



నేను ఆస్ట్రేలియా వెళ్లి మా ఆఫీసు పనులు చూసుకొని హైదరాబాద్ బయలు దేరేసరికి వారం రోజులు పట్టింది.

హైదరాబాద్‌లో మా బావమరిది రాఘవ సెక్రటేరియట్‌లో పని చేస్తు న్నాడు. రాష్ట్రం విడిపోయినా వాడు తెలంగాణ ప్రభుత్వంలో కొనసాగు తున్నాడు. వాడికి అక్కడ మంచి పలుకుబడి ఉంది.

ఆ మరునాడు ఆదివారం కావడంతో అతను, నేనూ కలిసి నిర్మాణంలో ఉన్న చాలా ఫ్లాట్స్‌ని చూసాం. అన్ని యాభై లక్షల పైమాటే.

ఎన్ని ఇళ్లు చూసినా నేను ఒక నిర్ణయానికి రాలేకపోయాను. నాకెందుకో ఫ్లాట్స్ అంటే మొదట్నుంచీ ఇష్టంలేదు. అందులో ఉంటే ఉక్కిరి బిక్కిరి అయినట్లు అనిపిస్తుంది నాకు. అందుకే అమెరికాలోని కాలిఫోర్నియాలోని స్టాన్స్‌ఫోర్డ్ దగ్గర దూరమైనా ఒక ఇండిపెండెంట్ ఇంట్లో అద్దెకి ఉంటున్నాను. దానివల్ల నేను ఆఫీసుకి వెళ్లడానికి ఒక గంట ఎక్కువ పడుతుంది. అయినాసరే నాకదే నచ్చింది.

ఇంక మర్నాడు నేను అమెరికా బయలుదేరాల్సిన సమయం. అప్పుడు నాకు సుధాకర్ చెప్పిన విషయం గుర్తుకొచ్చి వెంటనే ఎడ్రస్ వెతుక్కుంటూ వాడి తల్లిదండ్రుల్ని కలుసుకునేందుకు టాక్సీలో బయలుదేరాను.

ఎలాగైతేనేం రెండు గంటల తరువాత మదీనాగూడలో ఉంటున్న వాడి తల్లిదండ్రుల దగ్గరికి చేరుకున్నాను.

వాళ్లు నన్ను చూడటం అదే మొదటిసారి కావడంతో ఎన్నో ప్రశ్నలు వేసారు.

నేను వాళ్ల ప్రశ్నలన్నిటికీ ఓపిగ్గా సమాధానం చెప్పిన తరువాత లోపలికి అనుమతించారు.

"వాడెందుకు రాలేదు?" అని అడిగాడు అతని తండ్రి వెంకట్రావ్.

"మీకు తెలియందేముంది అంకుల్ మా ఉద్యోగాల సంగతి. మీరు కూడా అక్కడ కొన్నాళ్లున్నారు కదా! సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల్లో సెలవులు ఇవ్వరు. ఎక్కువ సెలవులు పెడితే ఉద్యోగం పోతుంది. మళ్లీ ఇంకో ఉద్యోగం దొరకడం చాలా కష్టం" అన్నాను, అతనికి సమాధానమిస్తూ.

"అంత కష్టపడి అక్కడ ఉండటం దేనికి చెప్పు. ఇక్కడకొచ్చెయ్యమని ఎన్నోసార్లు చెప్పినా వాడు వినిపించుకోవటం లేదు. వాడు ఒప్పుకున్నా మా కోడలు ఒప్పుకోదు. దానికి మాతో కలిసి ఉండటం ఇష్టంలేదు" అన్నాడతను కోపంగా.

"మీరే అక్కడికి రావచ్చు కదా అంకుల్.. ఈ ఫ్లాట్‌లో మీరిద్దరూ ఒంటరిగా ఉండటం.. వాడు రోజూ మీ గురించే ఆలోచిస్తూ బాధపడుతుంటాడు. మిమ్మల్ని చూడమని నన్ను పంపింది కూడా అందుకే" అన్నాను.

"అక్కడ రెండేళ్లు ఉన్నాం నాయినా.. మమ్మల్ని వాళ్లు తీసుకెళ్లింది అభిమానంతో కాదు, వాళ్ల పిల్లలకి కాపలా కోసం. వాళ్లని స్కూల్లో చేర్చిన తరువాత మమ్మల్ని ఇక్కడికి దిగబెట్టేసారు" కోపంగా అంది సుధాకర్ తల్లి అనసూయమ్మ.

"అవన్నీ సర్లే. ఇప్పుడా విషయాలెందుకుగానీ. నేను టీచరుగా పదవీ విరమణ తరువాత మా ఊళ్లోని లంకంత కొంపలో హాయిగా ఉంటే పొలాన్ని అమ్మించేసి ఆ డబ్బుతో ఇక్కడ ఇల్లు కొని మమ్మల్నిక్కడికి తీసుకొచ్చేసాడు. ఆ పల్లెలో అయితే మా జీవనం హాయిగా ఉండేది. పనులు చేసి పెట్టడానికి ఇరుగూ, పొరుగూ ఉండేవాళ్లు. మా రైతు అన్ని పనులు చేసేవాడు. అక్కడ మా జీవితం ప్రశాంతంగా ఉండేది. ఇక్కడ మాకు తెలిసినవాళ్లెవరూ లేరు. ఎంతసేపు టీవీ చూస్తాం చెప్పు.. చీటికి మాటికి కిందకు దిగలేని వృద్ధులం. పనివాళ్లు సరిగ్గా రారు. కరెంటు పోయినా, నీళ్లు రాకపోయినా పలికే నాథుడు లేడిక్కడ. ఇక్కడికి తీసుకొచ్చినప్పుడు ప్రతీ ఆర్నెల్లకొకసారి వస్తానని చెప్పాడు వాడు. ఇప్పటికి రెండేళ్లయింది రాలేదు. పుత్రుడు పున్నామ నరకం నుంచి తప్పిస్తాడంటారు... కానీ వాడు మేం బతికుండగానే మాకు నరకం చూపిస్తున్నాడు" అంటూ బాధపడ్డారు వెంకట్రావ్‌గారు.

వాళ్లకి ఎలా సమాధానం చెప్పాలో నాకు అర్థం కావట్లేదు. సుధాకర్ కేవలం బొమ్మ గురించే ఆలోచించాడు కానీ బొరుసు గురించి ఆలోచించినట్లు లేదు. వాడి తల్లిదండ్రులు మాత్రం బొరుసు గురించే ఆలోచిస్తున్నారు.

"మీరేం బాధపడకండి అంకుల్... మీవాడే కాదు.. ఇప్పుడు అందరం అలాగే ఉంటున్నాం. మీరు నలభై ఏళ్ల క్రితం పల్లెల్లోని ఉమ్మడి కుటుంబాలతో పోల్చి మమ్మల్ని అంటున్నారు. అప్పట్లో ఆ కుటుంబాల్లో ఎన్ని గొడవలు జరిగేవో మాకు తెలుసు. కానీ ఇప్పటి మా తరం వేరు. మమ్మల్ని మీరే చదివించారు. ఇక్కడ ఉద్యోగాలు రాక గతిలేక అమెరికా వెళుతున్నాం. పెళ్లిళ్లూ అంతే. అక్కడ జీవన విధానం, ఖర్చులు.. మాటిమాటికీ ఉద్యోగాలు మారుతుండటం.. ఇలా మేమందరం ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నాం. అయినా ఆ పల్లెలో ఇల్లు అమ్మి మిమ్మల్ని ఇక్కడికి తీసుకురావడం వాడి తప్పే. నేను వాడికి మీ సమస్య చెబుతాను" అంటూ నేను బయటకు వచ్చేసాను.

అరగంట తరువాత నా టాక్సీ విమానాశ్రయం వైపు వెళ్తోంది. ఇంకో మూడు గంటల్లో నా ఫ్లైట్. నాకెందుకో సుధాకర్ తల్లిదండ్రులతో మాట్లాడిన తరువాత మనసంతా ఆందోళనగా ఉంది.

> "అంత కష్టపడి అక్కడ ఉండటం దేనికి చెప్పు. ఇక్కడకొచ్చెయ్యమని ఎన్నోసార్లు చెప్పినా వాడు వినిపించుకోవటం లేదు. వాడు ఒప్పుకున్నా మా కోడలు ఒప్పుకోదు. దానికి మాతో కలిసి ఉండటం ఇష్టంలేదు. వాడు దాని మాట కాదనలేడు" అన్నాడతను.

ఇప్పుడు తను చేయబోయేది కూడా అదే. హైదరాబాద్‌లో ఇల్లు కొనాలంటే పల్లెలో ఉన్న పొలాన్ని అమ్మాలి, అది అమ్మకిష్టం ఉండదు. అదీకాక అమ్మని ఆ పల్లెలో ఒంటరిగా వదిలిపెట్టడం మంచిది కాదు. ఇప్పటికే మా చుట్టాల్లో చాలామంది నన్ను చాటుగా ఎన్నో మాటలంటున్నట్లు తెలిసింది. నేను డబ్బు మనిషిననీ, భార్య మాట విని తల్లిని పట్టించుకోవడంలేదనీ విమర్శిస్తున్నారనీ నా స్నేహితుడు రవి చెప్పాడు.

నిజానికి చదువైపోయిన తరువాత ఉద్యోగం రాక ఎన్నో ఇబ్బందులు పడ్డాను. ఇంటి దగ్గర రెండు సంవత్సరాలుండి వ్యవసాయం చేసినప్పుడు ఊళ్లో అందరూ ఎందుకు పనికిరానివాడివనీ అనేవారు. నేనక్కడ ఉండి వ్యవసాయం చెయ్యడం అమ్మా నాన్నలిద్దరికీ ఇష్టం ఉండేది కాదు. హైదరాబాద్ వెళ్లి ఉద్యోగం వెతుక్కోమనీ వాళ్లిద్దరూ రోజూ పోరు పెట్టేవారు. చివరకు వాళ్ల బాధ, ఊరివాళ్ల బాధ పడలేక హైదరాబాద్ వచ్చి ఓ సాఫ్ట్ వేర్ కంపెనీలో చేరి, తరువాత అమెరికా వచ్చాను. ఇప్పుడేమో తల్లిదండ్రుల్ని చూడటం లేదనీ అంటున్నారు. అమ్మా నాన్నలను అమెరికా రమ్మనమనీ ఎన్నో సార్లు చెప్పినా వాళ్లు రామన్నారు. అందుకే ఆ పల్లెలో వున్న ఇంటిని బాగు చేసి వాళ్లకు అన్ని సౌకర్యాలు కల్పించాను. దురదృష్టవశాత్తు నాలుగేళ్ల కిందట నాన్న చనిపోయినపుడు కూడా అమ్మ నాతో రానంది. తాను ఆ పల్లెలోనే ఉంటాననీ, తన తమ్ముడి కుటుంబం సహాయం చేస్తుందనీ చెప్పడంతో మా మేనమామకి అమ్మ బాధ్యత అప్పగించి వచ్చేసాను.

కారు హారన్ గట్టిగా కొట్టడంతో ఆలోచనల్లోంచి బయట పడ్డాను. కారుకి ఎదురుగా ఆవు. మనం ఎంత చేసినా విమర్శలొస్తూనే ఉంటాయి. అలా అనీ తల్లిదండ్రుల్ని వదిలిపెట్టలేం. లేకపోతే జీవితాంతం బాధపడక తప్పదు. విమానాశ్రయం దగ్గర పడుతున్నకొద్దీ నాలో అంతర్మథనం మొదలైంది.

తాను ఇల్లు కొనడానికి దేశాలు, ఖండాలు దాటి ఇక్కడికొచ్చి అమ్మని చూడకుండా వెళ్లిపోవటం చాలా తప్పనిపించసాగింది. అది ఎవ్వరూ ప్రశ్నించకపోయినా తన అంతరాత్మ ఊరుకోదు కదా.

ఇంతలో డ్రైవర్ "సార్! ఎయిర్‌పోర్ట్ వచ్చేసింది.." అన్నాడు.

నాలో సంఘర్షణ మరింత పెరిగింది. వాడు దిగి లగేజిని కారులోంచి తీయబోతుంటే "లగేజీ అలాగే ఉంచు. ఇప్పుడు నేను ఫ్లైట్‌కి వెళ్లటం లేదు. విజయనగరం దగ్గర మా పల్లెకి వెళ్లాలి.. వస్తావా?" అని అడిగాను.

వాడు నా వైపు ఆశ్చర్యంగా చూసి నవ్వుతూ కారుని స్టార్ట్ చేసాడు. కొద్ది నిమిషాల తరువాత టాక్సీ మా ఊరు వైపు పరుగులు పెట్టసాగింది.

కొద్ది గంటల్లో అమ్మని చూస్తానన్న ఆనందం నాకు ప్రశాంతతనివ్వసాగింది.

వెంటనే సెల్‌ఫోన్ తీసి మా ఆఫీసు హెచ్.ఆర్.మేనేజర్‌కు, లయకు వారం తరువాత వస్తానని మెసేజ్ పెట్టి, కళ్లు మూసుకున్నాను.

కొద్దిసేపటి తరువాత ఏసీ ఆపు చేయించి అద్దాలు తీసాను.

చల్లటి మలయమారుతం ముఖానికి తగలసాగింది.

అద్దంలోంచి బయటకు చూస్తే పచ్చటి ప్రకృతి.. నీలాకాశం.. తెల్లటి పక్షులు ఆకాశంలో మల్లెదండెలా కనిపిస్తున్నాయి.

ఆ సమయంలో నాకెందుకో నా బాల్యం గుర్తుకొచ్చింది. అమ్మ గుర్తుకొచ్చింది.

కారు వేగాన్నందుకుంది. ❑

# వాతావరణశాఖలో అన్నామణి సేవలు

**వర్షాలు, తుఫానులపై భారత వాతావరణ శాఖ కచ్చితమైన అంచనాలు వేస్తోందంటే అదంతా అన్నామణి చలవే. అందుకే దేశమంతా ఆమెను 'భారత వాతావరణ మహిళ (వెదర్ విమెన్ ఆఫ్ ఇండియా)'గా పిలుస్తారు. ఆమే భారత తొలి తరం మహిళా శాస్త్రవేత్తల్లో ఒకరైన అన్నామణి.**



## పన్నెండు ఏళ్లకే..

కేరళలోని పీర్‌మేడు గ్రామంలో 1918 ఆగస్టు 23న ఓ సిరియన్ క్రిస్టియన్ కుటుంబంలో అన్నామణి జన్మించారు. చిన్నప్పటి నుంచి ఆమెకు పుస్తకాలు చదవడం అంటే విపరీతమైన ఇష్టం. ఎంతలా అంటే ఒకసారి తల్లిదండ్రులు ఆమెకు పుట్టినరోజునాడు వజ్రాల చెవిపోగులు బహుమతిగా ఇస్తే వాటిని వద్దని తనకు ఎన్‌సైక్లోపిడియా బ్రిటానికా పుస్తకం ఆవాలని పట్టుబట్టారట. అప్పుడు ఆమె వయసు కేవలం ఎనిమిదేళ్లే. పన్నెండు ఏళ్లకే తమ ప్రాంతంలోని పబ్లిక్ లైబ్రరీల్లో ఉన్న పుస్తకాలన్నింటినీ చదివేశారు. అన్నామణిది ఎగువ మధ్య తరగతి సంప్రదాయ కుటుంబం. వీరి కుటుంబంలో అమ్మాయిలను ఉన్నత చదువులకు అంగీకరించకుండా పెళ్లికి పరిమితం చేసేవారు. కానీ మణి సంప్రదాయాలను పక్కనబెట్టి కుటుంబంతో పోట్లాడి మరీ ఉన్నత చదువులకు వెళ్లారు.

## వాతావరణంపై మక్కువతో..

చెన్నైలోని ప్రెసిడెన్సీ కాలేజీ నుంచి ఫిజిక్స్, కెమిస్ట్రీలో బీఎస్సీ ఆనర్స్ డిగ్రీ పూర్తి చేశారు. ఆ తర్వాత ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో స్కాలర్‌షిప్ పొందారు. గ్రాడ్యుయేషన్ పూర్తయిన తర్వాత నోబెల్ పురస్కార గ్రహీత ప్రొఫెసర్ సీవీ రామన్ వద్ద కొంత కాలం పాటు పరిశోధనలు చేశారు. ఐదు రీసెర్చ్ పేపర్స్‌ను తయారు చేసి పీహెచ్‌డీ కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఫిజిక్స్‌లో మాస్టర్స్ చేయని కారణంగా ఆమెకు పీహెచ్‌డీ దక్కలేదు. దీంతో 1945లో ఆమె మాస్టర్స్ కోసం లండన్ ఇంపీరియల్ కాలేజీకి వెళ్లారు. కానీ



అక్కడికి వెళ్లాక ఆమెకు వాతావరణ శాస్త్రం పట్ల ఆసక్తి పెరిగింది. దీంతో వాతావరణ శాఖ పరికరాల విభాగంలో స్పెషలైజేషన్ పూర్తి చేశారు. అనంతరం భారత్ తిరిగొచ్చి పుణెలోని వాతావరణ శాఖలో చేరారు.

## స్వదేశీ వాతావరణ పరికరాలకు మార్గం వేసి..

పుణెలో పని చేస్తున్నప్పుడే వాతావరణ పరికరాలపై అనేక పరిశోధనలు చేశారు. మన దేశం ఈ పరికరాల కోసం ఎక్కువగా బ్రిటన్‌పై ఆధారపడాల్సి వస్తోందని గమనించిన ఆమె– స్వదేశీ పరికరాల కోసం కృషి చేశారు. దాదాపు వంద పరికరాలను దేశంలోనే తయారు చేసుకునే విధంగా ప్రమాణాలను రూపొందించారు.

గాలివేగం, సౌర విద్యుత్‌ను కొలిచేందుకు తయారు చేసిన పరికరాలతో ఓ వర్క్‌షాప్ కూడా ఏర్పాటు చేశారు. ఆమె చేసిన పరిశోధనలే నేడు భారత వాతావరణ శాఖ కచ్చితమైన అంచనాలకు పునాదులు వేశాయి.

ఈ రంగంలో ఆమె చేసిన సేవలకుగాను అన్నామణిని 'వెదర్ విమెన్ ఆఫ్ ఇండియా'గా అభివర్ణించారు. పలు అవార్డులతో సత్కరించారు.

వివాహ బంధానికి దూరంగా ఉన్న అన్నామణి చిన్నప్పటి నుంచి గాంధేయవాదిగా ఉన్నారు. మహాత్ముడి వైకోమ్ సత్యాగ్రహ నుంచి స్ఫూర్తి పొందిన ఆమె అప్పటి నుంచి కేవలం ఖాదీ వస్త్రాలనే ధరించేవారు. 1976లో భారత వాతావరణ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జనరల్‌గా పదవీ విరమణ పొందారు. 2001 ఆగస్టు 16న తన 83వ పుట్టినరోజుకు సరిగ్గా వారం రోజుల ముందు అనారోగ్యంతో అన్నామణి కన్నుమూశారు.



**తెలుగు భాషా బోధన విద్యార్థులకు నిర్బంధంగా ఉండాలని, తెలుగులో శాస్త్ర విజ్ఞానం అభ్యసింపచేయడం వలన ఆధునిక భాష అభివృద్ధి చెందుతుందని వ్యావహారిక భాషా ఉద్యమానికి, సమాజ అభ్యుదయ లక్ష్యంతో, వాడుక భాషను ఆయుధంగా చేపట్టిన గిడుగు వేంకట రామమూర్తి, తెలుగు సరస్వతి నోముల పంటగా భారతీయ దేశ భాషల వికాస, సాహిత్య మార్గదర్శిగా లబ్ధప్రతిష్టులు.**

# తెలుగుకు ప్రాణదాత 'గిడుగు' కారణజన్ములు

భాష ఎప్పుడూ ఒకేలాగ ఉండదని, పరిణామ శీలిగా దేశ, కాలాలను బట్టి మారుతూ ఉంటుందని, దేశ భాష అంటే వర్తమాన వ్యావహారిక భాషేనని శాస్త్రీయ దృష్టితో గిడుగు చాటి చెప్పి, దేశ భాషలకు దిశానిర్దేశం అందించారు. ఆధునిక భాషా శాస్త్ర దృక్పథంతో గిడుగు, దేశ భాషలు నిత్య వ్యవహారాల్లోకి తెచ్చి, వాడుక భాషల ద్వారా సామాజిక అభివృద్ధి సాధించే ప్రయోజనాన్ని సాధించాలని జీవితాంతం శ్రమించి సఫలీకృతులయ్యారు.

ప్రజాసామాన్య జీవన ప్రగతికి, విజ్ఞాన దీపం వెలిగించి విద్యావికాసంతో, భాషా సంస్కారాన్ని ఒక సాధనంగా ఉద్యమ పంథాలో పండిత ప్రకాండుల భాషా భేషజాన్ని నిరసించే మహోద్యమ పోరాటానికి గిడుగు శ్రీకారం చుట్టారు. 1912లో గురజాడ ఒక లేఖలో "మనకు తెలిసినంతవరకు భారతీయులలో కానీ యూరోపియన్‌లలో కానీ భాషను వైజ్ఞానిక శాస్త్రీయ నేపథ్యంతో పరిశోధించిన పండితుడు, భాషా తత్వవేత్త గిడుగువారు ఒక్కరే" అన్నారు.

గిడుగువారి వాగ్యుద్ధాలు, 1906లో బ్రిటిష్ విద్యావేత్త జె.ఎ.యేట్స్‌తో ఆరంభమై 1940 వరకు రసవత్తర భాషా సాహిత్య సమరగాథగా కొనసాగింది. కొండలలో, కోనలలోని గిరిజన సవరల భాషకు జీవం పోసి, వారి జీవితాలలో మానవతావాదిగా విద్యా, సాంస్కృతిక వికాసానికి 'ఏ మెమొరాండం ఆన్ ది స్టేటస్ ఆఫ్ ది ఎడ్యుకేషన్ అమాంగ్ ది సవరాస్' నివేదికను 1894 సెప్టెంబరులో బ్రిటిష్ ప్రభుత్వానికి అందించారు. బ్రిటిష్




విద్యాశాఖాధికారి జెఎ యేట్స్‌తో ఆంగ్లభాషా బోధన, శాస్త్రీయ విజ్ఞానం, ధన్యాత్మక లేఖనా పద్ధతిలో వాచకాల రచనలు, 'టీచర్' పత్రికా ప్రచురణ నిర్వహించారు. 1919లో తన 'తెలుగు' పత్రిక ఉపోద్ఘాతంలో "విద్య అంటే తరగతి గదిలో మాత్రమే చెప్పేది కాదని, అభ్యుదయంతో జన సామాన్య ప్రగతికి భాషా సాహిత్యాలు జీవితంలో అన్ని రంగాలలో అవసరమే" అన్నారు. వాడుక భాష స్వరూపాన్ని, అభ్యుదయ సాధనలో అవసరాన్ని వివరిస్తూ తాను ఆంగ్లంలో రచించిన 'మెమొరాండం ఆన్ మోడరన్' తెలుగు పుస్తకాన్ని, గిడుగువారు బ్రిటిష్ భాషా శాస్త్రవేత్తలకు పంపించారు. విద్యాభివృద్ధికి వ్యవహారిక భాషే శరణ్యమని, కృతక గ్రాంథిక భాష వినియోగంపై పండితుల భాషా భేషజంపై ధ్వజమెత్తారు. నాటి మద్రాస్ ప్రెసిడెన్సీలోని గిరిజన జాతుల విద్యాభివృద్ధికి గిడుగు చేసిన నిర్విరామ కృషి ఎన్నో సత్ఫలితాలు యిచ్చింది.

గ్రాంథిక భాషావాదులకు, భాషా తత్త్వం తెలియదని నిరూపించిన గిడుగువారు, దేశ భాష సర్వజనానికి నిత్య వ్యవహారాల్లో ఉపయోగపడుతుందని వచన రచనలన్నీ వ్యావహారిక భాషలోనే వుండాలని చాటి చెప్పారు. భాషా శాస్త్రవేత్త, శాసన పరిశోధకుడు, శాసన, గ్రంథ పరిష్కర్త, పాఠ్య గ్రంథ రచయిత, విద్యావేత్త, సంఘసేవాభిలాషి, మానవతావాదిగా గిడుగు వేంకట రామమూర్తి, నిర్విరామ ఉద్యమ పోరాటాలలో ఉండగానే డెబ్బై సంవత్సరాలు నిండాయి. సప్తతి జన్మ దినోత్సవాల సందర్భంలో బాలకవి శరణ్యం, ఆంధ్ర పండిత భిషక్కుల భాషా భేషజం, గద్య చింతామణి, వ్యాసావళి గ్రంథాలు ఆవిష్కరించబడ్డాయి. 'మహా మహోపాధ్యాయ', 'రావు సాహెబ్', 'కైజర్-ఇ-హింద్' స్వర్ణ పతకం గ్రహీత, 'కళాప్రపూర్ణ' అయిన గిడుగు వేంకట రామమూర్తి గారి తమ చిట్టచివరి సందేశం తెలుగు పత్రికల రచయితలు, సంపాదకులకు తుది విన్నపం అయింది. మాతృభాషకు జీవద్భాషగా ప్రాణం పోసిన గిడుగు వారిని భవిష్యత్ తరాల తెలుగువారు సదా ఆరాధించవలసినదే.

**- జయసూర్య**

## కార్టూన్లకు ఆహ్వానం

కార్టూనిస్టుల నుండి ఆరోగ్యకరమైన హాస్యాన్ని అందించే కార్టూన్లను స్వాగతిస్తున్నాం. అంశం ఏదైనా సరే! మంచి హాస్యాన్ని అందించాలి. కార్టూన్లతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని కార్టూన్లను తిప్పి పంపేగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. కార్టూన్లు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త నం.396, లోయర్ ట్యాంక్‌బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.
sunmagvaartha@gmail.com

సింగిల్ పేజీ కథ

# దైవం మెచ్చిన పని

**సింగంపల్లి శేష సాయికుమార్**

ఒకరోజు వైకుంఠంలో శేషతల్పంపై నిదురిస్తున్న నారాయణుడి పాదాలు వత్తులూ ఉన్న లక్ష్మీదేవి శ్రీనివాసుని ముఖంపై నవ్వు రావడం చూసి "ఏమైంది స్వామీ! అలా నవ్వుతున్నారు?" అని అడిగింది ఆమె.

"మనిషిని ఆలోచనాపరుడు అంటాం, జంతువులకు వివేకం లేదు అంటాం. అలాంటిది వాటి ప్రపంచాన్ని కాపాడుకోవడం కోసం కొన్ని జంతువులు ఎంతగా పాకులాడుతున్నాయో చూసి మనుషులు ఎప్పుడు మారతారా?" అని నవ్వొచ్చింది అన్నారు స్వామి.

"ఏమైందో విపులంగా చెప్పమన్నారు" లక్ష్మి.

"అదిగో అటు చూడు" అన్నారు స్వామి.

అది స్వచ్ఛమైన కావేరీ నది జలాల మధ్య పెరిగిన దట్టమైన అటవీ ప్రాంతం. అందులోని చెట్లు ఏపుగా, దృఢంగా పెరిగి నాణ్యమైన కలపను కలిగి వున్నాయి. వాటిని అమ్మి ఎలాగైనా డబ్బు సంపాదించాలని చూస్తున్నాడు వీరప్ప. ఇందుకోసం ఒక బృందాన్ని ఏర్పాటు చేసి అడవిలో ఉన్న మంచి మంచి చెట్లను ఎన్నుకొని వాటికి రంగు గుర్తులు పెట్టి రమ్మన్నాడు.

దానికోసం చెరగని సింధూర వర్ణాన్ని వాళ్లకు ఇచ్చి పంపించారు వాళ్లు.

అడవిలో కలియ తిరుగుతూ మంచి చెట్లకు ఆ సింధూర వర్ణంతో గుర్తు పెట్టి వెళ్లసాగారు. ఇది గమనించిన అడవిలోని అన్ని జంతువులు సమావేశమై వీళ్ల నడవడి చూస్తుంటే ఆ చెట్లను నరికి మనకు ఆవాసాన్ని ఇచ్చే పచ్చని అడవిని లేకుండా చేస్తారని అనిపిస్తోంది. దీనిని ఆపడం కోసం ఒక ఉపాయం ఆలోచించసాగాయి.

ఒక కోతి చెంగు చెంగున వచ్చి "నేను సలహా ఇవ్వనా?" అంది. అందుకు అన్ని జంతువులూ సరేనన్నాయి.

"వాళ్లు రంగు వేసిన చెట్లను మాత్రమే నరికేస్తారు. అలాంటి చెట్లు మనకి మళ్లీ వృద్ధి కావాలంటే కొన్ని సంవత్సరాలు ఆగాలి. కనుక నా దగ్గర ఒక ఉపాయం ఉంది. దాని ప్రకారం చేద్దాం" అంటూ ఏనుగుల సహాయం కోరింది. అందుకు అన్ని ఏనుగులూ అంగీకరించాయి.

ఏనుగులన్నీ కావేరీ నది నుండి నోటితో నీటిని నింపుకొచ్చి తొండంతో గట్టిగా చెట్లపై పూసిన రంగుపై చల్లాయి. దాంతో రంగు మొత్తం తొలగిపోయింది. ఆ తర్వాత వానర సైన్యం అంతా చేరి దగ్గరలోని హనుమంతుని ఆలయానికి



వెళ్లి అక్కడ ఆయనకు పూసిన సింధూరాన్ని ఒంటికి పూసుకొని వచ్చి చిన్న చిన్న మొక్కల కాండం దగ్గర అద్దాయి.

కొన్ని రోజుల తరువాత వీరప్ప మరో బృందాన్ని ఏర్పరిచి అడవిలో రంగు పూసిన చెట్లను కొట్టుకురమ్మన్నాడు. అడవిలోకి వెళ్లిన వారిలో ఒకడు రెండు రోజుల తరవాత ఆయాసపడుతూ పరిగెత్తుకుని వచ్చాడు.


"చెప్పిన పని చేసారా?" అన్నాడు వీరప్ప.

"ఏంది సామీ చేసేది? అక్కడ అడవిలో ప్రతి చిన్న మొక్కకు రంగు పూసారు మీరు చెప్పినవాళ్లు. అవన్నీ కొట్టాలంటే మేం సంవత్సరాల తరబడి పని చేయాలి. అయినా అన్ని మొక్కల్ని మీరేం చేసుకుంటారు?" అన్నాడు వెర్రిగా నవ్వుతూ.

ఒకపక్క కోపం, మరోవైపు గందరగోళంతో రగిలిపోయిన వీరప్ప వాణ్ణి ఒక్క దెబ్బ బలంగా కొట్టాడు. అన్యాయంగా తమను కొట్టినందుకు కూలీలందరూ కలిసి గ్రామ పెద్దలకు మారప్పపై ఫిర్యాదు చేశారు.

గ్రామపెద్దలు ఒక సంవత్సరం పాటు వీరప్పను గ్రామ బహిష్కరణ చేశారు.

చుట్టూ ఉన్న అదే అడవుల్లో తిరుగుతూ వీరప్ప; కాపాడిన అడవిని ప్రేమగా, సంతోషంగా చూసుకుంటూ పెరుగుతున్న జంతువులను చూసి నారాయణుడు పక్కన నవ్వుకున్నాడు.







# బుల్లెట్ కాఫీ తాగేద్దాం

**మనం తాగే కాఫీలో రెండు స్పూన్ల శ్రేష్ఠమైన నెయ్యి లేదా బటర్ వేసుకుని తాగితే అది బుల్లెట్ కాఫీ. ఈ కాఫీనే కొందరు 'ఘీ కాఫీ', 'కీటో కాఫీ' అని పిలుస్తున్నారు. వయసు పైబడుతున్నకొద్దీ స్త్రీలలో అనారోగ్య సమస్యలు వస్తుంటాయి. ఘీ కాఫీ తాగితే హార్మోన్ల సమతుల్యత పెరిగి, ఇలాంటి సమస్యలు తగ్గు అవకాశం ఉంది.**

సెలబ్రిటీలు సైతం ఈ కాఫీ ఫిదా అంటున్నారు.

కాఫీలో కాస్త నెయ్యి లేదా బటర్ వేసుకోవడం వల్ల కెఫిన్ వల్ల కలిగే దుష్ప్రభావాలు తగ్గుతాయి. కాఫీ లేదా కెఫిన్ వంటివి కొందరిలో చికాకు కలిగించి ఆందోళనకు గురి చేస్తాయి. వేడి కాఫీలోకి రెండు చుక్కల నెయ్యి వేసుకుని తాగడం వల్ల సమస్య తీవ్రత తగ్గే అవకాశం ఉంది. నెయ్యిలోని కొవ్వులు శాంతపరుస్తాయి.

♣ బుల్లెట్ కాఫీ తాగేవాళ్లు ఇప్పుడిప్పుడే పెరుగుతున్నారు. దీనిపైన శాస్త్రీయ పరిశోధనలు జరగాల్సి వుంది. న్యూట్రిషనిస్టులు, డైటీషియన్ల సలహాలు తీసుకుని తాగాలి.

♣ తక్షణ శక్తికి బుల్లెట్ కాఫీ ఉపకరిస్తుంది. నెయ్యిలోని కొవ్వులు, ప్రొటీన్లు ఉత్సాహాన్ని కలిగిస్తాయి. ఫలితంగా ఉదయాన్నే చురుగ్గా మారతాం. జీవక్రియలు సైతం చురుకవుతాయి.

♣ ఉదయాన్నే కాఫీలో నెయ్యి వేసుకుని తాగడం వల్ల తిన్న ఆహారం మెల్లగా జీర్ణమై ఇన్సులిన్ కూడా నెమ్మదిగా విడుదల అవుతుందట. జీర్ణక్రియ చురుగ్గా లేని వాళ్లకు ఘీ కాఫీ ఎంతో మేలు చేస్తుంది.

....

నెయ్యిలో మంచి కొవ్వులు ఉంటాయి. పరగడుపున కాఫీతో పాటు తీసుకుంటాం కనుక బరువు తగ్గడానికి దోహదపడుతుంది. శరీరంలో పేరుకుపోయిన కొవ్వులను తొలగించడానికి కాఫీలోని నెయ్యి ఉపకరిస్తుంది.

♣ కాఫీలోని లాక్టోజ్ కొందరికి పడదు. ఇరిటేషన్ కలిగిస్తుంది. అయితే రోజూ కాఫీలో నెయ్యి వేసుకోవడం వల్ల లాక్టోజ్ వల్ల కలిగే ఇబ్బందులు తొలగుతాయి.





# గృహ నిర్మాణానికి ముందు ఏం చేయాలి?

**గృహ నిర్మాణం ప్రారంభించిన తరువాత చాలా మంది వాస్తు శాస్త్రజ్ఞులను సంప్రదిస్తుంటారు. అది సరైన పద్ధతి కాదు. గృహ నిర్మాణ ప్రారంభానికి కొన్ని రోజులు ముందే వాస్తు శాస్త్రజ్ఞుల్ని సంప్రదించాలి. గృహానికి సంబంధించిన ప్లాను చూపించి అందులో అవసరమైన మార్పులు, చేర్పులు చేయించుకోవాలి. గృహం నిర్మించే ప్లాటు పరిసరాలను పరిశీలించిన తర్వాతే అనుభవం వున్న ఏ శాస్త్రజ్ఞులైనా సరైన సంపూర్ణ సలహాలిస్తారు.**


వాస్తువార్త

వాస్తు విద్వాన్ సాయిశ్రీ

డా॥ దంతూరి పండరినాథ్

3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్

సెల్స్: 9885446501/9885449458




ప్లాటు స్వరూప స్వభావాలను బట్టి దానిని సవరించటం మొదటి కర్తవ్యం.

స్థలం సమ భుజ సమకోణాల్లో వుందో లేదో మొదట కొలతలు తీసుకొని చూసుకోవాలి. సమ భుజ, సమ కోణ స్థలాలు గృహ నిర్మాణానికి అత్యంత శ్రేష్ఠమైనవి.

గృహం నిర్మాణం చేయాలనుకున్న స్థలం ఒకవేళ సమ భుజ, సమ కోణాలు కలిగి లేకపోతే ఆ స్థలాన్ని ఆ విధంగా వచ్చేట్టు సవరించాలి. ఈ విషయంలో కొంత స్థలాన్ని ఉచితంగా వదిలివేయవలసి వస్తుంది. స్థలాల విలువ డబ్బు రూపంలో ఎక్కువగా వున్నందువల్ల స్థలాన్ని వదిలిపెట్టడానికి స్వంతదారులు సాధారణంగా ఇష్టపడరు. కానీ అలాంటి స్థలాలను సవరించకుండా గృహ నిర్మాణం జరపటం వల్ల వాళ్లు భవిష్యత్తులో చాలా నష్టపోవాల్సి వస్తుంది. వాళ్లే కాక వాళ్ల తరువాత వంశపారంపర్యంగా ఆ ఇంటికి యజమానులైనవాళ్లు కూడా విపరీతంగా నష్టపోవడం దృష్ట్యా వదిలిపెట్టాల్సిన స్థలం స్థలంవిలువ చాలా చిన్నదని గుర్తించాలి.

## స్థలాలను సవరించటం ఎలా?

దోషపూరితమైన స్వరూపం కలిగిన స్థలాలను కొనకపోవటం ఉత్తమం. ఒకవేళ కొనాల్సి వస్తే వాస్తు దోషాలను సవరించి ఇల్లు కట్టుకోవటం మంచిది.

స్థలానికి ఆగ్నేయం పెరిగి వుంటే ఆ స్థలంలో గృహ నిర్మాణం చేసుకుని నివసిస్తున్న యజమాని కానీ, కిరాయిదారులుగానీ ఎప్పుడూ టెన్షన్‌తో వుండే అవకాశం ఉంది. డబ్బు చేతిలో కనిపించినట్టే కనిపించి ఖర్చయిపోతూ వుంటుంది. ఆగ్నేయంలోనే తూర్పుకు ముఖ ద్వారంతో గృహం నిర్మిస్తే అతని పరిస్థితి గోరుచుట్టు మీద రోకటి పోటులా తయారవుతుంది. అందువల్ల ఇలాంటి స్థలాలను సవరించకుండా ఇల్లు నిర్మించటం వల్ల లేని కష్టాలను కొనితెచ్చుకున్నట్టే అవుతుంది.



## ఆగ్నేయం పెరిగిన స్థలాన్ని ఎలా సవరించాలి?

తూర్పు. దక్షిణ భుజాల ముందుకు పొడుచుకువెళ్లటం వల్ల ఆగ్నేయం పెరుగుతుంది. ఈశాన్య, నైరుతి మూలలు 90 డిగ్రీల కంటే ఎక్కువ అవుతాయి. ఆగ్నేయ మూల 90 డిగ్రీల కంటే తక్కువ అవుతుంది. ఆ విధంగా ఈ స్థలం సమ కోణ, సమ భుజాలు లేని స్థలం అవుతుంది. ఈశాన్య, వాయువ్య, నైరుతి మూలలు సరిగ్గా 90 డిగ్రీల సమకోణం వచ్చేట్టు సరిచేయిస్తే ఆగ్నేయ మూల కూడా 90 డిగ్రీల కోణంలోకి వచ్చి కొంత స్థలం మిగులుతుంది. ఆ స్థలమే ఆగ్నేయాన్ని పెంచే స్థలం. దాన్ని వదిలివేసిన స్థలాన్ని, సమ కోణ, సమ భుజాలు కలిగిన స్థలంగా గుర్తుంచుకోవాలి.

ఇవే కాక 1) తూర్పు ఆగ్నేయం పెరుగుదల 2) దక్షిణ ఆగ్నేయం పెరుగుదల అని ఆగ్నేయం పెరగటం ఇంకా రెండు రకాలుగా ఉంటుంది.

కొన్ని స్థలాలు దక్షిణ, పశ్చిమాలు పెరిగి నైరుతి ముందుకు పొడుచుకు వచ్చినట్లు ఉంటుంది. ఇలాంటి స్థలాలను సవరించకుండా ఇల్లు కడితే అనారోగ్య సమస్యలు, శత్రువుల విజృంభణ జరిగే అవకాశాలు ఎక్కువ. అన్ని కోణాలను సమ కోణాలుగా సరిచేసి, మిగతా స్థలాన్ని వదిలివేయటం వల్ల అటువంటి ప్రమాదాల నుండి జాగ్రత్తలు తీసుకున్న వాళ్లమవుతాం. దక్షిణ నైరుతి పెరిగితే స్త్రీలకు అనారోగ్య సమస్యలు వస్తాయి. పశ్చిమ నైరుతి పెరిగిన స్థలాన్ని సమ కోణ, సమభూజాలుగా సవరించకుండా ఇల్లు నిర్మించటం వల్ల ఇంటి యజమానికి ఆరోగ్య సమస్యలు వస్తాయి.

నైరుతి పెరిగిన స్థలాల్లో నైరుతి ముఖద్వారంగానీ, ఇంటిగేటు నిర్మించడం సముచితం కాదు. ■


# మాటలకు వర్ణాలు

**వర్షం** పడుతుంటే వేడి వేడిగా ఓ కప్పు టీ తాగాలని, మిర్చిబజ్జీలు తినాలనిపిస్తుంది. కానీ మిత్రుడు పాత పుస్తకాల దుకాణాలను వెతుక్కుంటూ పోతాడు వాన పడుతుంటే. వానాకాలంలోనే కాదు మామూలుగా కూడా అతనికి ఇష్టమైంది పాత పుస్తకాల కోసం వెతకడం. కానీ వర్షా కాలంలో రోడ్డు పక్కన ప్లాట్‌ఫారాల మీద పుస్తకాలు అమ్మేవారికి ఒకింత కష్టమే. ఓ ఆదివారం నేను ఓ సమావేశంలో పాల్గొన్న తర్వాత అక్కడి నుంచి తిన్నగా ఆబిడ్స్ బయలుదేరాను. అక్కడ ఆదివారాలు పాత పుస్తకాలు నాతో పాటు పుస్తక ప్రియులందరినీ పిలుస్తున్నట్టు నిరీక్షిస్తుంటాయి. మనం వాటిని సమీపించడంతోనే వాటికెంత ఆనందమో. మనల్ని ఎంతలా స్వాగతిస్తాయో చెప్పలేను. నేను బస్సెక్కి ఆబిడ్స్‌లో బస్సు దిగి రెండడుగులు వేసానో లేదో చినుకులు మొదలయ్యాయి. జీపీఓ ముందర అప్పటికే నేల మీద పరచిన పుస్తకాలను దగ్గరకు తీసి ప్లాస్టిక్ వకర్లు కప్పేసారు. ఒక్క పుస్తకమూ చూడటానికి కుదరలేదు. కాస్సేపు ఓ దుకాణం పక్కన నిల్చుని వర్షం తగ్గితే బాగుంటుందని ఆశించాను. కానీ వర్షం ఆగకపోవడంతో నిరాశతో ఇంటికి వచ్చేశాను. వర్షం వచ్చినప్పుడు పాత పుస్తకాలు తడవకుండా విక్రేతలు జాగ్రత్తపడటం తప్పదు. వారికవి అమ్మితేనే జీవితం గడిచేది. వర్షం నాకో విధమైన నిరాశైతే వారికో రకం నిరాశ. కనుక వర్షం అందరికీ సంతోషాన్ని తీసుకొస్తుందన్నది ఒక విధంగా సరికాదు. కొందరికి లాభం, కొందరికి నష్టం. కొందరికి సంతోషం, కొందరికి శోకం. వర్షంరోజుల్లో ఒకటి రెండు పుస్తకాలు కూడా అమ్ముడుపోవు. వర్షం పడుతున్నప్పుడు ఎవరు పుస్తకాలను వెతుక్కుంటూ వచ్చి కొంటారు? నా మిత్రుడు వర్షాన్ని లెక్కచెయ్యకుండా ఓ పాత పుస్తకాన్ని కొనడానికి వెళ్తుంటాడు. ఎక్కడో అక్కడ ఓ మూల ఓ పైకప్పు కింద ఒక్కరైనా పాత పుస్తకాలు అమ్మరా ఏమిటి? అన్నది అతని ప్రశ్న. అలాగే అతను ఒకటి రెండు కొనుక్కునే ఇంటికి చేరడం అలవాటు.

అంతేకాదు.. వర్షం తగ్గి రాత్రి వాతావరణంలో ఆ పుస్తకాన్ని చదివి ఆనందిస్తాడు. అలా ఓమారు వర్షంహోరులో అతను పుస్తకాలు కొనడానికి వీలు లేకుండా పోయింది. వర్షం పడుతూనే ఉంది. రాత్రి తొమ్మిదైంది. బయట వాకిట్లో కాలింగ్ బెల్ మోగింది. తలుపు తీశాడు మిత్రుడు. అతనుండే ఇంటికి దగ్గరలో పాత పుస్తకాలు అమ్మే ఓ మనిషి సగం తడిసి నిల్చున్నాడు. ఆయన చేతిలో ఓ సంచి, దాని నిండా పుస్తకాలు. "సార్, ఈరోజు వ్యాపారమే లేదండీ.. పస్తండీ. ఈ సంచీలోని పుస్తకాలను తీసుకుని ఓ రెండు వందల రూపాయలు ఇవ్వండయ్యా. తినడానికి పోవాలి" అన్నాడు ఎంతో దీనంగా.

అతను నిల్చున్న తీరు చూడడంతోనే పుస్తకాలు తీసుకురాకపోయినా డబ్బులిచ్చే వాడిని. అంత దీనంగా కనిపించాడు. అతను ఏ పుస్తకాలు తీసుకొచ్చాడనేది కూడా చూడకుండా వెంటనే డబ్బులిచ్చాను, తీసుకుని వెళ్లిపోయాడు.

అతను వెళ్లిన కాస్సేపటికి గదిలోకి వెళ్లి ఏ పుస్తకాలు తీసుకొచ్చాడని ఒక్కొక్కటీ చూసాను. విక్టర్ ఫ్రాంకిల్. ఎమర్సన్, నట్‌హాంసన్, జోనథన్ స్విఫ్ట్, జిడ్డు కృష్ణమూర్తి.. ఇలా ప్రముఖులు రాసిన పది పుస్తకాలు ఉన్నాయి. నా మిత్రుడు ఎప్పుడూ ఆ దుకాణంలో ఎక్కువగా పుస్తకాలు కొంటుంటాడు. కనుక అతని అభిరుచి ఏమిటో దృష్టిలో పెట్టుకుని ఆ దుకాణదారు పది పుస్తకాలు తెచ్చిచ్చాడు. ఇంతకూ మా మధ్య ఉన్న బంధం ఏమిటి? దానికి ఏం పేరు పెట్టాలి? తెలీడం లేదు.



నిజానికి అతనిచ్చిన పుస్తకాలకు అతను అడిగిన రెండు వందలు చాలా తక్కువ. మరుసటి రోజు అతని దుకాణానికి వెళ్లి మరికొంత డబ్బు ఇవ్వాలనుకున్నాడు నా మిత్రుడు. అలాగే వెళ్లాడు కూడా. తీరా అక్కడికి వెళ్లేసరికి దుకాణం మూసేసుంది. సగానికి పైగా పుస్తకాలు వాననీటికి తడిసిపోయి దుకాణం పక్కనే రోడ్డు మీద కనిపించాయి. వాటిని ఎండబెట్టి అమ్మడానికి వీల్లేని విధంగా ఉన్నాయి. సమీపంలో ఉన్న ఓ మనిషితో మాట్లాడితే తెలిసిందేమిటంటే అతను తన సొంత ఊరుకి వెళ్లిపోయాడని. ఆ తర్వాత ఆ దుకాణం తెరవనే లేదు. అయితే అనుకోకుండా ఓ మారు ఓ చోట అతను నా మిత్రుడికి కనిపించాడు.

అతను ఓ సైకిల్ మీద పాత పేపర్ల కోసం పోతుండటం చూశాను.

"ఏమైంది?" అని అడిగాడు నా మిత్రుడు.

"ఏం చెప్పనయ్యా, పాత పుస్తకాలు ఇక తిండి పెట్టవనిపించింది. వానా కాలంలో పుస్తకాలను తడవనివ్వడం చూస్తుంటే చాలా కష్టంగా ఉందండీ, అందుకే ఇప్పుడు ఇలా పాత పేపర్లు కొనే వ్యాపారం చేస్తున్నానండీ!" అని చెప్పాడు.

"నాకెక్కడైనా పాత పుస్తకం దొరికితే మీకు తప్పకుండా ఇస్తానండి" అని మాటిచ్చాడు.

అతనలా చెప్తున్నప్పుడు మిత్రుడి మనస్సు బరువెక్కింది. "ఇంకా కొంత డబ్బు నీకివ్వాలి. ఇప్పటికిప్పుడు నా దగ్గర లేదు. నువ్వెక్కడ ఉంటావో చెప్తే వచ్చి ఇస్తాను" అన్నాడు, నా మిత్రుడు.

"వద్దు సార్" అన్నాడతను. ఆ వర్షంరాత్రి మీరిచ్చిన డబ్బుతోనే మా కుటుంబం ఆకలి తీరింది. కనుక మీ సాయానికి కృతజ్ఞతలు" అన్నాడతను.

అప్పుడు నా మిత్రుడు ఇలా అనుకున్నాడు.. "ఇంతటి మనసు ఎవరికి ఉంటుందని. అతనినే చూస్తూ నిల్చున్నాడు.

పుస్తకాలు చదివేవారు ముఖ్యం కాదు. పాత పుస్తకాలు అమ్మేవారు కూడా పుస్తక ప్రియులే" అని.

అంతేకదండీ. ఇది వాస్తవం. పుస్తకాలతో బంధం ఎప్పుడూ మనిషికి అవసరం. అలాగే వాటికీ మనిషి అవసరం ఉంది. ఇద్దరి మధ్య బంధం పెనవేసినప్పుడే అక్షరాలు బతికేవి. మాటలు బతికేవి. కథలు బతికేవి. విషయాలు బతికేవి. కనుక పుస్తక ప్రియులంటే ఎంత ఇష్టమో పుస్తకాలమ్మే వారంటే నాకంతే ఇష్టం, ప్రేమ. మాటలు వర్ణమయమవ్వాలంటే విక్రేతలు, వినియోగదారుల మధ్య గట్టి బంధం ఉండాలని నా అభిప్రాయం.

**– యామిజాల జగదీశ్**



# వారఫలం

పాలకుర్తి సంతోష శర్మ, స్మార్త పండితులు
సుబ్బరాజు టవర్స్, 11-10-30/308
విజయపురి కాలనీ, కొత్తపేట
హైదరాబాద్. ఫోన్: 9494608133

## మేషం



ఆరోగ్య సమస్యలుంటాయి. భాగస్వామ్య వ్యాపారులకు సామాన్యంగా ఉంటుంది. సాహిత్య సభలు, సమావేశాల్లో పాల్గొంటారు. ఆకస్మిక ఖర్చులు వచ్చి పడతాయి. విదేశాల్లో వున్న ఆత్మీయుల నుండి శుభ సమాచారం అందుకుంటారు. అనుకోని బంధువుల రాక ఆనందం కలిగిస్తుంది. దేవాలయాలు సందర్శిస్తారు. మొండి బకాయిలు వసూలవుతాయి.

## వృషభం



ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తారు. విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు లభిస్తాయి. ప్రముఖులతో పరిచయం ఏర్పడుతుంది. శుభ కార్యాలకు హాజరవుతారు. అనుకోని వార్తలు వింటారు. అకారణంగా మానసిక సంఘర్షణకు లోనవుతారు. చిరు వ్యాపారులకు రుణాలు మంజూరు. విదేశీ వస్తువులపై మక్కువ ఏర్పడుతుంది. నూతన వాహన యోగం.

## మిథునం



వృత్తి వ్యాపారులకు బాగుంటుంది. అన్ని వ్యవహారాల్లో ఆచి తూచి వ్యవహరిస్తారు. విద్యార్థులు అధిక శ్రమ చేయాల్సి ఉంటుంది, ఫలితాలు కూడా అదే స్థాయిలో ఉంటాయి. ధర్మ రక్షణకై పాటుపడతారు. ఉద్యోగంలో ఒడుదుడుకులుంటాయి. దుర్వ్యసనాలకు దూరంగా వుండడం మంచిది. అదనపు ఆదాయ మార్గాలకై అన్వేషిస్తారు. వాహన యోగం.

## కర్కాటకం



ఉద్యోగులకు ఉన్నతాధికారుల ప్రశంసలు లభిస్తాయి. ఆకస్మిక సంఘటనలు జరుగుతాయి. సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారు. శుభ కార్యాల్లో పాల్గొంటారు. కుటుంబ గౌరవం పెంపొందుతుంది. దేశాంతర ప్రయాణ సూచనలున్నాయి. వృత్తి విద్యా కోర్సుల్లో చేరతారు. ఏది జరిగినా మన మంచికే అన్న ధోరణి అలవడుతుంది. కోర్టు తీర్పు అనుకూలం.

## సింహం



భూ-వివాదాలు తీరి లబ్ధి పొందుతారు. విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు లభిస్తాయి. కళాకారులకు ప్రోత్సాహం లభిస్తుంది. వృధా కాలక్షేపం మానుకుంటే మంచిది. సన్నిహితుల సహకారంతో ముఖ్యమైన పనులు పూర్తి చేస్తారు. ఆధ్యాత్మిక చింతన అలవడుతుంది. సంతానాభివృద్ధి సంతృప్తికరంగా ఉంటుంది. క్రయ-విక్రయాలు సామాన్యంగా వుంటాయి.

## కన్య



దుష్ట సాంగత్యం మంచిది కాదని స్వీయానుభవంతో తెలుసుకుంటారు. చోర భయం పొంచి వుంది కనుక విలువైన పత్రాలు, విలువైన వస్తువుల విషయంలో జాగ్రత్తలు పాటించండి. ఉద్యోగులకు స్థాన చలన సూచనలున్నాయి. వృత్తి విద్యా కోర్సులు చేసిన వారికి ఆర్థికంగా ఆశించిన విధంగా ఉంటుంది.ప్రత్యర్థుల వ్యూహాలను చాకచక్యంతో ఎదుర్కొంటారు.

## తుల



కుటుంబ బాధ్యతలు తీరుతాయి. దూర ప్రాంత ప్రయాణ సూచనలున్నాయి. ఉద్యోగంలో ఒడుదుడులుంటాయి. సోమరితనం దరి చేరనివ్వకండి. అనుకోని వార్తలు వింటారు. అనాథాశ్రమాలకు ఇతోధికంగా సహాయం చేస్తారు. వివాదాలకు దూరంగా వుండడం చెప్పదగిన సూచన. స్త్రీలకు శుభ యోగం. విదేశీ వస్తువులపై మక్కువ ఏర్పడుతుంది. విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు లభిస్తాయి.

## వృశ్చికం



పోటీ పరీక్షల్లో విజయం సాధిస్తారు. వ్యతిరేకతలు ఎదురైనా ప్రారంభించిన పనులు పూర్తి చేస్తారు. ధర్మ రక్షణకై పాటుపడతారు. వాక్చాతుర్యంతో అందరినీ ఆకట్టుకుంటారు. విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు. శత్రువులు మిత్రులుగా మారతారు. కుటుంబ ఖర్చులు పెరుగుతాయి, సంయమనంతో వ్యవహరించడం మంచిది. ధార్మిక చింతన అలవడుతుంది. రియల్ ఎస్టేట్ రంగంలోనివారికి సామాన్యం.

## ధనుస్సు



వ్యాపారులు కొన్ని చోట్ల నష్టపోతారు. సన్నిహితుల సహకారంతో ముఖ్యమైన పనులు పూర్తి చేస్తారు. ఉద్యోగ ప్రయత్నం ఫలిస్తుంది. పోటీ పరీక్షల్లో విజయం సాధిస్తారు. చిరకాలం కోరిక తీర్చుకుంటారు. తాహతుకు మించిన రుణాలు చేయకపోవడం ఉత్తమం. దంపతుల మధ్య మనస్పర్థలకు అవకాశం. దేశాంతర ప్రయాణం చేస్తారు. ప్రతికూలతలు ఎదురైనా ప్రారంభించిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు.

## మకరం



వివాదాలకు దూరంగా వుండండి. స్త్రీలు స్థిరాస్తులు కొనుగోలు చేస్తారు. శత్రువులు మిత్రులవుతారు. గతంలో ఆగిపోయిన పనులు తిరిగి ప్రారంభిస్తారు. మొండి బకాయిలు వసూలవుతాయి. సామాజిక సంఘర్షణకు లోనవుతారు. దూర ప్రాంతాల్లో వున్న ఆత్మీయుల నుండి శుభ సమాచారం తెలుసుకుంటారు. ఆరోగ్యం కుదుట పడుతుంది. వ్యవసాయదారులకు బాగుంటుంది. క్రీడాకారులకు ప్రోత్సాహం లభిస్తుంది.

## కుంభం



ప్రయాణాల్లో విలువైన వస్తువుల పట్ల అప్రమత్తంగా ఉండండి. అన్ని వ్యవహారాల్లో ఆచి తూచి వ్యవహరిస్తారు. ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. వృత్తి విద్యాకోర్సులు అభ్యసించిన వారికి ఉన్నతోద్యోగం లభిస్తుంది. ప్రభుత్వ సంబంధమైన పనులు వారాంతంలో పూర్తవుతాయి. ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తారు. ధర్మ రక్షణకై పాటుపడతారు.

## మీనం



ఉద్యోగులకు పనివత్తిడి అధికం. విద్యార్థులు అధిక శ్రమ చేయాల్సి వస్తుంది, ఫలితాలు కూడా అలాగే వుంటాయి. చిరకాల కోరిక వారాంతంలో నెరవేరుతుంది. వాక్చాతుర్యంతో అన్ని పనులు చక్కబెట్టుకుంటారు. ఆహార, ఆరోగ్య సలహాలు, సూచనలు పాటించండి. క్రయ-విక్రయాలు సామాన్యంగా ఉంటాయి. కుటుంబ సభ్యుల మధ్య మనస్పర్థలు తీరి ప్రశాంతత ఏర్పడుతుంది. దేశాంతర ప్రయాణం చేస్తారు.

# సరదాగా కాసేపు నవ్వుకోండి

### ఇద్దరు స్నేహితుల మధ్య సంభాషణ:

మొదటివాడు: "పెళ్లయితే పిచ్చి కుదురుతుందని అంటారు కదా" అన్నాడు.
రెండవ వాడు: "అవును ఇప్పుడేమయింది? పెళ్లి చేసుకున్నావు కదా" ఆశ్చర్యంగా అడిగాడు.
మొదటివాడు: "పిచ్చివాడుగా వున్నప్పుడే బాగుంది" అన్నాడు, మొదటివాడు.
"ఆ.." అంటూ నోరెళ్లబెట్టాడు రెండోవాడు.

### తాళి మెడలో పడగానే..

మొదటివాడు: "గురూ! మనకు ధైర్యం కావాలంటే మందు కొడతాం. మరి ఆడవాళ్లకు అంత ధైర్యం ఎలా వస్తుంది?" అన్నాడు.
రెండో వ్యక్తి: "మగవాడు తాళి కట్టగానే" అన్నాడు.
"అవునా!" అంటూ ఆశ్చర్యపోయాడు రెండోవాడు.



### మీ అమ్మకు...

పనమ్మాయి సెలవు పెట్టింది.. భార్యా భర్తల మధ్య సంభాషణ..
భార్య: "ఏమండీ! మీ అమ్మగారిని రమ్మని ఫోన్ చేయండి. ఓ నెల రోజులు మనతో పాటు ఉంటుంది" అంది.
భర్త: "ఓ.. ఇప్పుడే ఫోన్ చేస్తాను" అన్నాడు.
భార్య: "మీరెంత మంచివారండీ!"
భర్త: "ఫోన్ చేసేది మీ అమ్మకు.. మా అమ్మకు కాదు" అన్నాడు.
"హు.." అని మొహం చిట్లించుకుంటూ అక్కడి నుంచి వెళ్లిపోయింది భార్య.

**- సదాశివరెడ్డి,** తిరుపతి

### పైకప్పు లేని ఇల్లు

సుబ్బారావ్: వర్షం వచ్చినా రాకున్నా మీ ఇంట్లో అందరూ గొడుగులు పట్టుకుని తిరుగుతుంటారెందుకు? అడిగాడు రంగారావుని ఆశ్చర్యంతో.
రంగారావ్: మరేంలేదు.. ఇంటి అద్దె చాలా చౌక అంటే పైకప్పు లేని ఇంట్లో చేరాంలెండి" మెల్లగా చెప్పాడు.

### హాస్య కవిత

నిర్మాత: జుం జుం జిర్మా
మొదలెట్టాడు సిన్మా
సినిమా పేరు.. నా ఖర్మ
హీరో, హీరోయిన్.. నల్లి, బల్లి
దర్శకత్వం.. తాబేలు
కథ, మాటలు రైటింగు.. ఉడుత
ఊసరవెల్లి క్లాపింగు
సామర్లకోటలో సిన్మా సార్టింగు
ఇచ్ఛాపురంలో ఈటింగు
అచ్చాపురంలో స్లీపింగు
శృంగారపురంలో నల్లి,
బల్లి లవ్వింగు
కృష్ణాపురరంలో కిస్సింగు
జమలాపురంలో జంపింగు
సినిమా ఇంతటితో స్టాపింగు
నిర్మాత, బర్మా గోయింగు.

**- సంపంగివారి జయచంద్రారెడ్డి,** బాపట్ల

### చేపల పెంపకం

ఇంటి యజమానితో "సార్! ఇంట్లోకి వర్షపునీరు వచ్చింది" ఏడుపు ముఖంతో అన్నాడు అద్దెకు ఉంటున్నతను.
"మరింకేం! చేపల పెంపకం మొదలుపెట్టండి" సంతోషంగా చెప్పాడు, ఇంటి యజమాని.

### లారీని గుద్దితే సరి...

"స్వామీ! నా మెళ్లో ఇంతవరకు ఏ ఒక్కరు కూడా దండ వేయలేదు. ఈ వెయ్యి తీసుకుని మెళ్లో దండ వేసేట్టు ఏదైన ఓ మాంచి ఐడియా చెప్పండి" అన్నాడు జ్యోతిష్యునితో.
"మరేంలేదు.. కార్లో వెళ్లి రోడ్డు మీదున్న ఏ బస్సునో, ఏ లారీనో గుద్దిదే చాలు. నీ కోరిక తీరుతుంది" ఠక్కున చెప్పాడు.

### వేర్లకుంటాయి..

ఒకసారి వ్యవసాయాధికారి రైతు వేసిన వేరుశెనగ పంటను పరిశీలించడానికి పొలంకెళ్లి ఓ రైతుతో "ఏమయ్యా! చెట్లకు పూత తప్ప కాయల్లేవేంటి?" అన్నాడు అమాయకంగా.
"సార్! కాయలు చెట్ల వేర్లకు ఉంటాయి" అంటూ ఒక చెట్టును పెరికి కాయలు చూపించాడు నవ్వుతూ.

### రైట్ సైడ్

డాక్టరు: ఇలా మెడ వంకరగా ఎప్పట్నించి ఉందోయి?" అని కాలేజీ స్టూడెంటును ప్రశ్నించాడు డాక్టరు.
"నిన్న నైట్ బస్సులో జర్నీ చేస్తున్నప్పుడు నా పక్క సీట్లో లెఫ్ట్ సైడ్ కూర్చున్న అమ్మాయి వంక చూస్తూ విజయవాడ నుంచి హైదరాబాద్ వరకు వచ్చాను డాక్టర్" బాధగా అన్నాడు.
"ఓస్... అంతేనా! టుమారో నైట్ రైట్ సైడ్ కూర్చున్న అమ్మాయి వంక చూడ్డానికి ప్రయత్నిస్తూ హైదరాబాద్ నుంచి విజయవాడకు వెళ్తే సరి. ఏ ప్రాబ్లమ్ ఉండదిక" వెటకారంగా అన్నాడు డాక్టర్.

**- ఆనెకాళ్ల నెమిలిరెడ్డి,** ఆరవీటికోట

### జోక్స్‌కు ఆహ్వానం

మీరు పంపే జోక్స్ హాస్యాన్ని పండించేలా ఉండాలి.
కాపీ జోక్స్‌ను పంపకండి. చిరునామా:
ఎడిటర్, ఆదివారం వార్త, నం.396,
లోయర్ ట్యాంక్ బండ్, హైదరాబాద్-500 080
sunmagvaartha@gmail.com



**చిత్రభారతి**

**వాశిరాజు ప్రకాశం**

# మమతలకు మారుపేరు తమిళ సినిమా

ఏభై సంవత్సరాల క్రితం దక్షిణాది భాషా చిత్రాలకు చెన్నై (మదరాసు) అందరికీ ఒక ఒకటే రాజధాని. అన్ని భాషల వారు చెన్నైలో అన్నదమ్ముల్లా కలిసి వుండేవారు. కాలగర్భంలో వచ్చిన సామాజిక పరిణామాల వల్ల తెలుగు సినిమా హైదరాబాద్‌కు చేరింది. కర్ణాటక సినిమా బెంగళూరు వెళ్లింది. మలయాళ సినిమా కేరళ వెళ్లింది.

ఆయా భాషల చిత్రాలు స్వరాష్ట్రాలకు వెళ్లినా చెన్నై నగరంలో స్థిర నివాసం ఏర్పడిన తమిళ సినిమా నాటికీ, నేటికీ మమతల కోవెలలా, ఆత్మబంధువుల్లా యిప్పటికీ అలాగే వున్నారు.

ఈ నాలుగు భాషలు మాత్రమే కాదు, ముంబయ్ నుండి హిందీ నిర్మాతలు వచ్చి చెన్నైలో షూటింగు చేసేవారు. కారణం.. చెన్నైలో వారం రోజుల్లో పూర్తయ్యే షూటింగు ముంబయ్‌లో పదిహేను రోజులు పట్టేది. ఆ వేగం, ఆ అనుబంధం యిప్పటికీ అలాగే వుంది. బడ్జెట్ భారీగా పెరగటం, విదేశాల్లో షూటింగులు పెరిగిపోయినా పొదుపుగా చిత్రాలు తీసేవారు, తీయగలిగినవారు యిప్పటికీ ఎక్కువగానే వున్నారు. అందుకు ముఖ్య కారణం.. ఈ నాలుగయిదు భాషల చిత్రాల్లో అన్నింటిలో పనిచేయగలిగినవారు, అన్ని భాషలు నేర్చినవారు యిప్పటికీ చాలా మంది చెన్నైలో వున్నారు. వీరందరికీ తమిళ సినిమా నేర్పిన అనురాగం అలాంటిది.

ముఖ్యంగా నాలుగు భాషలకు అద్భుతంగా సేవలు అందించిన హీరోయిన్లను సినిమా మరిచిపోదు. కాలానుగుణంగా వయస్సు పెరిగినా అలాంటి తారలు వయసు మళ్లిన పాత్రలకు రహదారి మార్చుకున్నారుగానీ, విశ్రాంతి పర్వంలోకి అడుగులు వేయకపోవటం ఆయా తారలకు లభించిన పట్టుదల, ప్రతిభ కారణం. దేవిక, సరోజాదేవి, శారద, అంజలీ దేవి, షీలా, జయంతి మొదలయిన తారలకు భాషాభేదాలు లేవు. అలాగే తమిళ తారలు తళుక్కుమనటం సినిమా వైభవానికే చెల్లింది. తమిళ భాషను తొలిసారిగా పరిశీలిద్దాం.

ఎప్పుడూ ఎం.జి.ఆర్, శివాజీ గణేశన్ పేర్లే వినబడేవి. ఈ ఇద్దరూ అధిక సంఖ్యా చిత్రాలు పంచుకున్నా యిద్దరూ వారి వారి వృత్తి నైపుణ్యంలో మేధావులయినా వివాదాలు తెలియని తమిళ సినిమా. తతిమా భాషల్లో సైతం ఈ ఐకమత్యం వుండటానికి కారణం.. అందరూ వృత్తికోసం, విజయం కోసం ఆరాటపడినవారే.



ఉదాహరణ ఎం.జి.ఆర్. యాక్షన్ చిత్రాలు, ఫైట్స్‌ను ఆరాధిస్తుంటే; మరోవైపు శివాజీ గణేశన్ సాంఘిక చిత్రాలు, కుటుంబ గాథాచిత్రాలు ప్రేమించారు. ఈ యిద్దరు తరచుగా ఒకే స్టూడియోలో పక్క పక్కనే వుండే ఫ్లోర్స్ వద్ద కలిసినా తీరిక వేళల్లో, భోజన విరామంలో కబుర్లు చెప్పుకునేవారు. అలాగే ఆ రోజుల్లో వున్న అతిపెద్ద స్టూడియో, ఔట్‌డోర్ లొకేషన్స్ కలిపి ఏక కాలంలో పది, పదిహేను షూటింగులు జరిగేలా కెమెరాలు, లైట్స్ అందుబాట్లో వుండేవి. అదే స్థాయిలో టెక్నీషియన్లు వుండేవారు.

శివాజీ గణేశన్ (అసలు పేరు విల్లుపురం చిన్నిగణేశన్) 'పరాశక్తి'తో తమిళ సినిమా అంతస్తు పెంచారు. నిర్మాతలకు ఆశల హరివిల్లుగా నిలిచారు.

ఎం.జి.ఆర్‌కు మరో నేపథ్యం ఉంది. ఆయన స్వతహాగా కేరళవాసి అనే పేరు వున్నా చెన్నై నగరానికి వచ్చి 1936లో 'సతీలీలావతి' చిత్రంలో నటించిన తరువాత ఆయన చెన్నైకు ఖాయమయ్యారు, సినిమాలు పెరిగాయి.

కాలక్రమంలో నిర్మాతగా మారి 'ఉలగం సుట్రుం వాలిబన్' అనే చిత్రాన్ని నిర్మించారు.

ఈ చిత్రం తెలుగులో 'లోకం చుట్టిన వీరుడు'గా డబ్బింగ్ అయింది. ఈ సినిమాలో ముగ్గురు హీరోయిన్లు నటించారు. తమిళ ప్రేక్షకులు తండోపతండాలుగా ఈ ఇద్దరి చిత్రాలు చూశారు.

ఈ ఇద్దరు హీరోలకు బంధంతో, అనుబంధంతో నిలబడిన ఒకే ఒక తమిళ కమెడియన్ నగేష్. ప్రముఖ దర్శకుడు బాలచందర్ శిక్షణలో వచ్చిన నగేశ్ ఆనాటి తమిళ చిత్రం 'మేజర్ చంద్రకాంత్' (తెలుగులో 'సుఖదుఃఖాలు'– చంద్రమోహన్) పాత్రలో అద్భుతంగా నటించారు. తెలుగులో దేవులపల్లి కృష్ణశాస్త్రి గారు రాసిన పాట 'ఇది మల్లెల వేళయని.. ఇది వెన్నెల మాసమని తొందరపడి ఒక కోయిల ముందే కూసింది' అంటూ సాహితీ సుగంధం వెదజల్లిన ఈ పాటకు తమిళ మూలాధారం కాకపోయినా భావాలు నిర్మలంగా వున్నప్పుడు భాష అదే కలిసిపోతుంది. మనసున మల్లెలు పూగుతాయి. దీనికి ముఖ్య కారణం.. నేటికీ అన్ని భాషల కళాకారుల చెక్కుచెదరని ఐకమత్యం. అలాగే తెలుగు చిత్రాలు తెలుగింటి దీపాలు, గుండెల్లో వెలిగే ఆమని కాంతులు! సినిమా కళా స్వరూపం అయినా, అంతకు మించిన ఆత్మీయతల వెల్లువ కావటం భారతీయ సినిమా చేసుకున్న అదృష్టం. ◆

ఈ సరంగా 'ర్టూన్స్'



డా॥ IAS
కలెక్టర్
..సార్ లేరు.. కేంద్ర మంత్రి వస్తున్నారట కదా.. జీకే అప్డేట్ కోసం కోచింగ్ సెంటర్‌కు వెళ్లారు..!!
Zakir...
కొడితే 'అమ్మా' అని ఏడుస్తున్నట్టు.. 'మమ్మీ' అని ఏడవాలని ట్యూషన్ లో నేర్పించండి...!!
ప్రిన్సిపాల్ -
ఇంగ్లీష్ మీడియం
Zakir...
అన్ని షాపుల్లో రాజు గారి చిత్రపటాలుండాలి అని ఆజ్ఞలున్నా... వీడి 'సులభ్ కాంప్లెక్స్' లో పెట్టలేదు రాజా...!!







పట్టపగలే చుక్కలు చూడాలనుకుంటున్నారా? అయితే అలస్కా వెళ్లాల్సిందే!. సముద్ర మట్టానికి సుమారు ఆరు వేల అడుగుల ఎత్తులో నిర్మించిన ఈ హోటల్ రాత్రి సమయంలోనే కాదు పట్టపగలే చుక్కలు చూపిస్తుంది. అత్యంత ఖరీదైన ఈ హోటల్ అలస్కాలోని డాన్ షెల్టన్ యాంఫిథియేటర్ శిఖరంపైన ఉంది. చుట్టూ పర్వతాలు, ఎటు చూసినా ప్రశాంత వాతావరణం షెల్టన్ షాలెట్ హోటల్ ప్రత్యేకతలు.





